PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU

దినపత్రిక

www.evarthalu.com


మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

బుధవారం WEDNESDAY 15-4-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00
సంపుటి: 1 Volume:1 ‖ సంచిక: 286 Issue: 286

Published from Jagitial
Circulated to Telangana

15 ఏప్రిల్ 2026 - బుధవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - వసంత ఋతువు చైత్ర మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:04 సూర్యాస్తమయం - సా. 6:28 తిథి త్రయోదశి రా. 10:26 వరకు తరువాత చతుర్దశి సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం పూర్వాభాద్ర మ. 3:09 వరకు తరువాత ఉత్తరాభాద్ర యోగం బ్రహ్మ మ. 1:12 వరకు కరణం గరజి ఉ. 11:23 వరకు వనిజ రా. 10:26 వరకు వర్జ్యం రా. 12:24 నుండి రా. 1:54 వరకు దుర్ముహూర్తం ఉ. 11:51 నుండి మ. 12:40 వరకు రాహుకాలం మ. 12:16 నుండి మ. 1:49 వరకు యమగండం ఉ. 7:37 నుండి ఉ. 9:10 వరకు గుళికకాలం ఉ. 10:43 నుండి మ. 12:16 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:28 నుండి తె. 5:16 వరకు అమృత ఘడియలు ఉ. 7:35 నుండి ఉ. 9:09 వరకు అభిజిత్ ముహూర్తం లేదు గమనిక: "౦" అనగా మరుసటి రోజున




## కొవిడ్ వ్యాక్సిన్‌పై తొలగని అనుమానాలు

# టీకా పోటు!

## దాని వల్లే గుండె పోట్లు అని ప్రజల డౌట్లు

### ప్రభుత్వాలు చెప్తున్నా తొలగని సందిగ్ధత

### ఎక్కడో తేడా కొడుతోందని సంశయాలు

### తాజాగా బాంబ్ పేల్చిన మస్క్, వార్న్ కొడుకు

"నా తండ్రి మరణించినప్పుడు ముందుగా నా మనసులోకి వచ్చింది కొవిడ్ వ్యాక్సినే. అవి కూడా ఆయన మరణంలో పాత్ర పోషించి ఉండవచ్చని అనుమానం కలిగింది. నా తండ్రికి మూడు లేదా నాలుగు డోసుల వ్యాక్సిన్ వేయించుకోవడం ఇష్టం లేదు. కానీ పని నిమిత్తం తప్పనిసరి పరిస్థితుల్లో ఆయన వాటిని తీసుకున్నారు. మరణించే సమయానికి నా తండ్రి చాలా ఆరోగ్యంగా, సంతోషంగా ఉన్నారు. ధూమపానం, మద్యపానం వంటి అలవాట్లు ఉన్నప్పటికీ, అంతకంటే ఎక్కువ అలవాట్లు ఉన్న 80-90 ఏళ్ల వారు కూడా క్షేమంగా ఉన్నారు. అందుకే నా తండ్రి మరణం ఆశ్చర్యం అనిపించింది. ఈ విషయాలను స్మారక సభలోనే చెప్పాలనుకున్నా, కానీ అప్పుడు అది సరైన నిర్ణయం కాదని భావించి మౌనంగా ఉండిపోయా."

--------------- జాక్సన్ వార్న్ (క్రికెటర్ షేన్ వార్న్ కుమారుడు)

"కరోనా రెండవ వ్యాక్సిన్ డోస్ తీసుకున్న తర్వాత చనిపోతానా? అన్నంత ఆందోళన కలిగింది. దాదాపు ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది. నాకు వ్యాక్సిన్ రాకముందు సోకిన ఒరిజినల్ వుహాన్ వైరస్ సాధారణ జలుబు లేదా ఫ్లూ లాగా అనిపించింది, కానీ వ్యాక్సిన్ ప్రభావం మాత్రం చాలా తీవ్రంగా ఉంది. వ్యాక్సిన్ మోతాదు చాలా ఎక్కువగా ఉంది. అనవసరంగా ఎక్కువ సార్లు ఇస్తున్నారనిపించింది."

– ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్



"కొవిడ్ టీకా తీసుకోవడం వల్ల యువతలో ఆకస్మిక మరణాల ముప్పు పెరుగుతుందన్న వాదనల్లో వాస్తవం లేదు. ఆకస్మిక మరణాలకు టీకా కారణం కాదు, గతంలో కొవిడ్ వల్ల ఆసుపత్రిలో చేరడం, కుటుంబంలో ఆకస్మిక మరణాల చరిత్ర ఉండటం, విపరీతమైన జీవనశైలి అలవాట్లు (ధూమపానం, మద్యపానం వంటివి), తీవ్రమైన వ్యాయామం వంటివి ప్రధాన కారణాలు."

– గత ఏడాది జూలై 2న ఐసీఎంఆర్ వివరణ

ICMR
INDIAN COUNCIL OF MEDICAL RESEARCH
Serving the nation since 1911

- డ్యాన్స్ చేస్తూ 19 ఏళ్ల కుర్రాడు స్పాట్ డెడ్.. కారణం.. గుండెపోటు
- కూర్చున్న చోటే 14 ఏళ్ల బాలిక హఠాన్మరణం.. కారణం.. గుండెపోటు
- క్లాస్‌లో పాఠాలు వింటూ 12 ఏళ్ల బాలిక మృతి.. కారణం.. గుండెపోటు
- పెళ్లి మండపంలో ఫొటో దిగుతూ యువతి మృతి.. కారణం.. గుండెపోటు
- జిమ్ చేస్తూ 30 ఏళ్ల యువకుడు మరణం.. కారణం.. గుండెపోటు

యవ్వనంలోనే గుండె గుబేల్..
కారణం ఏంటి? అంటే..
కరోనా వ్యాక్సినేమో!?
ప్రజల్లో ఇదే డౌటనుమానం..!
ప్రభుత్వాలు చెప్పినా అదే సంశయం..!

(ఈవార్తలు – స్పెషల్ డెస్క్)

కరోనా మహమ్మారి కోరల నుండి ప్రపంచాన్ని రక్షించడంలో కీలక పాత్ర పోషించిన కొవిడ్ వ్యాక్సిన్లపై మరోసారి నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ఇటీవలి కాలంలో గుండెపోటుతో సంభవిస్తున్న మరణాలు, ప్రముఖుల సంచలన ప్రకటనలు సామాన్యుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. మొన్నటికి మొన్న ఎలాన్ మస్క్ తన వ్యక్తిగత అనుభవాన్ని పంచుకుంటూ, ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్ రెండో డోస్ తనను చంపేసినంత పనిచేసిందని, ఆసుపత్రిలో చేరాల్సి వస్తుందేమోనని తరువాయి 2 వ పేజీలో...

నేటి ఈవార్తలు SPECIAL STORY

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,393 |
| వెండి (గ్రాము): | రూ.265 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,242 |

# లోక్‌సభ సీట్లు.. 850

## రాష్ట్రాలకు 815.. యూటీలకు 35
## కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదన

### 2011 లెక్కల ఆధారంగానే నియోజకవర్గాల పునర్విభజన
### ఇప్పటికే పార్లమెంట్ సభ్యులకు చేరిన సమాచారం!
### దీనికోసమే రేపటి నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు
### సమావేశాల్లోనే మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లు



న్యూఢిల్లీ: ప్రతిపాదిత నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియపై కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం మంగళవారం కీలక నిర్ణయం తీసుకుంది. లోక్‌సభ స్థానాల పెంపునకు సంబంధించిన ప్రతిపాదనలు చేసింది. ప్రస్తుతం ఉన్న 543 స్థానాలను 850కి పెంచాలని ప్రతిపాదించింది. ఇందులో రాష్ట్రాలకు 815 సీట్లు.. కేంద్రపాలిత ప్రాంతాలకు 35 సీట్లు ఉంటాయి. 131 రాజ్యాంగ సవరణ ద్వారా సీట్లు పెంపునకు ప్రతిపాదనలు చేసింది. ఈ మేరకు పార్లమెంట్ సభ్యులకు కేంద్రం సమాచారం ఇచ్చినట్టు తెలుస్తోంది. 2011 జనాభా లెక్కల ఆధారంగానే నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను కేంద్రం చేపడుతోంది. ఇందుకోసం ఏప్రిల్ 16 నుంచి మూడు తరువాయి 2 వ పేజీలో...



# కేంద్రప్రభుత్వంపై కాలు దువ్వుదాం


## డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం

### ఏకమై కొట్లాడుదాం..తమిళనాడు సీఎంకు రేవంత్ లేఖ

నియోజకవర్గాల పునర్విభజన విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి.. దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని గత కొన్ని రోజులుగా తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఇప్పటికే మోదీ సర్కార్‌కు పలు సూచనలు చేశారు.

హైదరాబాద్, ఏప్రిల్ 14 (ఈవార్తలు): అదే సమయంలో తాజాగా కేంద్రం డీలిమిటేషన్ ప్రతిపాదనలు విడుదల చేయడంతో.. దానికి సంబంధించి.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సీఎం రేవంత్ రెడ్డి లేఖ కూడా రాశారు.అదే సమయంలో ఈ విషయంలో దక్షిణాది రాష్ట్రాలను ఏకం చేసే పనిలో పడ్డారు. ఇందులో భాగంగానే తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు రేవంత్ రెడ్డి తాజాగా లేఖ రాశారు. ఈ సందర్భంగా నియోజకవర్గాల పునర్విభజన అంశంపై దక్షిణాది రాష్ట్రాల ఐక్యతకు రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. జనాభా ప్రాతిపదికన కేంద్ర ప్రభుత్వం.. లోక్‌సభ సీట్లను పెంచితే.. జనాభా నియంత్రణను -2 వ పేజీలో...

## విశ్వవాణి



నార్వేకు చెందిన ఓ హెచ్‌ఐవీ బాధితుడు తన సోదరుడి నుంచి సేకరించిన మూల కణాలతో చేసిన చికిత్స తర్వాత పూర్తిగా కోలుకున్నాడు. బాధితుడి సోదరుడి కణాల్లో వైరస్‌ను అడ్డుకొనే అరుదైన జన్యు పరివర్తనం ఉండటం వల్లే ఇది సాధ్యమైందని వైద్యులు పేర్కొన్నారు.




# ఎండ.. 43.3 డిగ్రీలు

## అత్యధికంగా నిజామాబాద్ జిల్లా మచ్చర్లలో నమోదు

హైదరాబాద్, ఏప్రిల్ 14 (ఈవార్తలు): వారం నుంచి తెలంగాణలో ఎండల తీవ్రత గణనీయంగా పెరిగింది. మంగళవారం రాష్ట్రంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నిజామాబాద్‌లో అత్యధికంగా ఆలూరు మండలం మచ్చర్లలో 43.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే ఆదిలాబాద్‌లో 42.3 డిగ్రీలు, మహబూబ్‌నగర్‌లో 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయినట్లు వాతావరణ శాఖ తెలిపింది. హైదరాబాద్‌లోనూ 40 డిగ్రీలకుపైగా తరువాయి 2 వ పేజీలో...



# జీవన్ రెడ్డికి ఏం తక్కువ చేసినం?

## ఓడిపోయినా భవిష్యత్తుపై హామీ ఇచ్చిన.. మొండిపట్టుతో పార్టీని వీడారు

### కార్యకర్తలను మోసం చేశారు.. జగిత్యాల నేతలతో సీఎం రేవంత్

హైదరాబాద్, ఏప్రిల్ 14 (ఈవార్తలు): జగిత్యాల నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. సీనియర్ నాయకులు జీవన్ రెడ్డి పార్టీ వీడటం పట్ల సీఎం ఆవేదన వ్యక్తం చేస్తూనే, ఆయన నిర్ణయాలను తప్పుబట్టారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ జీవన్ రెడ్డిని తక్కువ చేసి చూడలేదని, ఆయన గౌరవ మర్యాదలకు భంగం కలిగేలా తాము ఎప్పుడూ వ్యవహరించలేదని - 2 వ పేజీలో...

## జగిత్యాల లొల్లి హైదరాబాద్‌కు!

### సీఎంను కలిసిన కాంగ్రెస్ సీనియర్ నేతలు

### సీనియర్లకు సరైన గుర్తింపు లేదని ఆవేదన

# రాశి ఫలాలు



15.4.2026

మేషం: భూ క్రయ విక్రయాలలో నూతన లాభాలు అందుతాయి. వాహన కొనుగోలు ప్రయత్నాలలో అవరోధాలు తొలగుతాయి. సేవా కార్యక్రమాలు నిర్వహించి మీ విలువ మరింత పెంచుకుంటారు. వృత్తి, వ్యాపారాలలో కీలక నిర్ణయాలు తీసుకుని లాభాలు అందుకుంటారు. ఉద్యోగస్తులకు పదోన్నతుల పెరుగుతాయి.

వృషభం: కుటుంబ సభ్యుల ప్రవర్తన మానసికంగా బాధిస్తుంది. ఆర్థిక ఇబ్బందులు ఉంటాయి. దీర్ఘకాలిక వివాదాలు నుండి కొంతవరకు బయటపడగలుగుతారు. దూర ప్రయాణ సూచనలు ఉన్నవి. వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగాలలో అధికారుల నుండి విమర్శలు ఎదుర్కొంటారు.

మిథునం: ఋణ దాతల ఒత్తిడి వలన మానసిక సమస్యలు కలుగుతాయి. కీలక వ్యవహారాలలో ఆలోచనలలో స్థిరత్వం లోపిస్తుంది. చేపట్టిన పనులు చాలా కష్టం మీద పూర్తి అవుతాయి. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు ఉంటాయి. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. నిరుద్యోగులకు నిరాశ తప్పదు.

కర్కాటకం: సమాజంలో ప్రముఖుల ఆదరణ పెరుగుతుంది. విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. సంతాన విద్యా విషయాలు సంతృప్తి కలిగిస్తాయి. చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. వృత్తి వ్యాపారాలలో ఆశించిన పురోగతి సాధిస్తారు. ఉద్యోగమున సహోద్యోగులతో సఖ్యతగా వ్యవహరిస్తారు.

సింహం: చిన్ననాటి మిత్రులతో దూర ప్రయాణాలు చేస్తారు. నూతన వ్యక్తుల పరిచయాలు లాభసాటిగా సాగుతాయి. చేపట్టిన వ్యవహారములు అనుకున్న విధంగా పూర్తిచేస్తారు. నిరుద్యోగ ప్రయత్నాలు కలసివస్తాయి. వృత్తి వ్యాపారాలలో యత్న కార్యసిద్ధి కలుగుతుంది. ఉద్యోగులకు హోదాలు పెరుగుతాయి.

కన్య: ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. చేపట్టిన వ్యవహారాలలో శ్రమాధిక్యత పెరుగుతుంది. చిన్ననాటి మిత్రులతో స్వల్ప విభేదాలు కలుగుతాయి. గృహ నిర్మాణ ప్రయత్నాలు మందగిస్తాయి. వృత్తి, వ్యాపారాలు సాధారణంగా సాగుతాయి. ఆర్థిక వ్యవహారాలలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి.

తుల: దూర ప్రయాణాలలో మార్గ అవరోధాలు కలుగుతాయి. ఋణదాతల నుండి ఒత్తిడి పెరుగుతుంది. మిత్రులతో దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఇంటా బయట కొందరి ప్రవర్తన వలన మానసిక ప్రశాంతత లోపిస్తుంది. వృత్తి,వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. ఉద్యోగ వాతావరణం నిరుత్సాహపరుస్తుంది.

వృశ్చికం: సన్నిహితులతో పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. దీర్ఘకాలిక వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. సోదరుల నుండి శుభవార్తలు అందుతాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. నిరుద్యోగులకు అందిన సమాచారం ఉత్సాహాన్నిస్తుంది. ఉద్యోగమున అదనపు బాధ్యతల నుండి ఉపశమనం పొందుతారు.


ధనస్సు: ఆధ్యాత్మిక విషయాలపై ఆసక్తి పెరుగుతుంది. చేపట్టిన పనుల్లో ప్రతిబంధకాలు ఉంటాయి. నేత్ర సంభందిత ఆరోగ్య సమస్యలు బాధిస్తాయి. కుటుంబ వాతావరణం కొంత గంధరగోళంగా ఉంటుంది. నూతన వ్యాపారవిస్తరణ ప్రయత్నాలు కలిసిరావు. ఉద్యోగమున అదనపు బాధ్యతలు చికాకు పరుస్తాయి.

మకరం: సన్నిహితులతో గృహమున ఉత్సాహంగా గడుపుతారు. చేపట్టిన వ్యవహారాలలో ఆకస్మిక విజయం సాధిస్తారు. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో నూతన ఆలోచనలు ఆచరణలో పెట్టి లాభాలు అందుకుంటారు. వృత్తి ఉద్యోగాలలో ఆశించిన అవకాశములు అందుతాయి.

కుంభం: దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తివ్యాపారాలలో ఊహించని మార్పులు తప్పవు. దూర ప్రయాణాలు వాయిదాపడతాయి. జీవిత భాగస్వామితో అకారణ వివాదాలు కలుగుతాయి. ఉద్యోగమున ప్రతికూల వాతావరణం ఉంటుంది. వృధా ఖర్చులు చేదాటుతాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం.

మీనం: ఆర్థిక పరిస్థితి గతం కంటే మెరుగవుతుంది. విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. నిరుద్యోగులకు అనుకూల వాతావరణం ఉంటుంది. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. వృత్తి, వ్యాపారాలలో నూతనోత్సాహంతో ముందుకు సాగుతారు. ఉద్యోగస్తులకు అధికారుల అనుగ్రహం పొందుతారు.

# టీకా పోటు!




మొదటి పేజీ తరువాయి

భయపడ్డానని చేసిన వ్యాఖ్యలు ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. మస్క్ వ్యాఖ్యలకు తోడు, జర్మనీ పార్లమెంటులో మాజీ ఫైజర్ శాస్త్రవేత్త డాక్టర్ హెల్మట్ స్టెర్జ్ చేసిన ఆరోపణలు చర్చనీయాంశమయ్యాయి. ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్ల అభివృద్ధిలో కీలకమైన భద్రతా పరీక్షలను విస్మరించారని, దీనివల్ల వేల సంఖ్యలో మరణాలు సంభవించి ఉండవచ్చని ఆయన పేర్కొన్నారు. అదే సమయంలో, ఆస్ట్రేలియా క్రికెట్ దిగ్గజం షేన్ వార్న్ కుమారుడు జాక్సన్ వార్న్, తన తండ్రి అకాల మరణానికి వ్యాక్సిన్లే కారణమై ఉండవచ్చని తాజాగా వెల్లడించారు. వార్న్ హృదయ సంబంధిత వ్యాధితో మరణించినప్పటికీ, వ్యాక్సిన్ వల్ల ఆ సమస్యలు బయటపడ్డాయని అభిప్రాయపడ్డారు.

## శాస్త్రీయమా.. భావోద్వేగమా?

ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్లు ప్రమాదకరమని చెప్పడం లేదా వ్యక్తిగత సంఘటనలను వ్యాక్సిన్‌తో అనుసంధానం చేయడం వంటి వ్యాఖ్యలు శాస్త్రీయ ఆధారాల కంటే భావోద్వేగాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తాయి. ఒక వ్యక్తి మరణానికి లేదా అనారోగ్యానికి వ్యాక్సిన్ కారణమని తేల్చాలంటే గట్టి వైద్యపరమైన ఆధారాలు అవసరం. లేకపోతే అది కేవలం అనుమానంగానే మిగిలిపోతుంది. ఇక్కడ ప్రధాన సమస్య ఏమిటంటే.. సమాచార యుగంలో అపోహలు వేగంగా వ్యాపించడం. సోషల్ మీడియా వేదికలపై వచ్చిన ప్రతి వ్యాఖ్యను నిజమని నమ్మడం ప్రమాదకరం. ముఖ్యంగా ప్రజలు ఆరోగ్యానికి సంబంధించిన నిర్ణయాలు తీసుకునేటప్పుడు శాస్త్రీయంగా నిర్ధారించిన సమాచారాన్ని మాత్రమే ఆధారంగా తీసుకోవాలి. అటు.. ప్రభుత్వాలు, ఆరోగ్య సంస్థలు కూడా పారదర్శకంగా వ్యవహరించడం అత్యంత ముఖ్యం. వ్యాక్సిన్ల దుష్ప్రభావాలు ఉన్నాయా? ఉంటే అవి ఎంతవరకు తీవ్రమైనవి? అనే విషయాలను స్పష్టంగా ప్రజలకు తెలియజేయాలి. అలా చేస్తేనే ప్రజల్లో నమ్మకం పెరుగుతుంది. అనుమానాలను దాచిపెట్టడం కంటే, వాటిని శాస్త్రీయంగా సమాధానం ఇవ్వడం సమాజానికి మేలు చేస్తుంది. మొత్తానికి, కొవిడ్ వ్యాక్సిన్‌పై మళ్లీ తలెత్తుతున్న అనుమానాలను తేలికగా తీసుకోవడం సరికాదు. కానీ అదే సమయంలో అవాస్తవ ప్రచారాలకు లోనవ్వడం కూడా ప్రమాదకరం. శాస్త్రం, ఆధారాలు, బాధ్యతాయుతమైన చర్చ.. ఇవే ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే మార్గాలు.

## భయపెడుతున్న గణాంకాలు

కొవిడ్ మహమ్మారి తర్వాత గుండెపోటు, సంబంధిత మరణాల సంఖ్య పెరిగినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మహమ్మారి సమయంలో గుండె జబ్బుల మరణాల రేటు దాదాపు 5.9% పెరిగింది. మహమ్మారి తర్వాత ఈ రేటు 3.4% తగ్గినప్పటికీ, కొవిడ్ పూర్వకాలంతో పోలిస్తే ఇప్పటికీ 2.4% అధికంగానే ఉంది. భారత్ వంటి దేశాల్లో 2020 నుంచి నమోదైన గుండెపోటు కేసుల్లో దాదాపు 50% మంది 40 ఏళ్లలోపు వారే ఉండటం గమనార్హం.

## కారణం కొవిడ్ వ్యాక్సినేనా?

ప్రజల్లో ఉన్న అతిపెద్ద అనుమానం వ్యాక్సిన్‌లపైనే ఉన్నప్పటికీ, శాస్త్రీయ పరిశోధనలు దీనిని ప్రాథమిక కారణం కాదని కొట్టివేస్తున్నాయి. భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్), ఎయిమ్స్ నిపుణులు ఆకస్మిక గుండెపోటు మరణాలకు, కొవిడ్ టీకాలకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. వ్యాక్సినేషన్ తీసుకున్న వారిలో గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదం తగ్గినట్లు 4.6 కోట్ల మందిపై నిర్వహించిన ఒక భారీ అధ్యయనం పేర్కొంది. టీకా వల్ల గుండె కండరాల వాపు వంటి సమస్యలు వచ్చే అవకాశం 1,40,000 మందిలో ఒకరికి మాత్రమే ఉండొచ్చని, అది కూడా ప్రాణాంతకం కాదని నిపుణులు వివరిస్తున్నారు. అయితే, కొన్ని అరుదైన సందర్భాల్లో ఎంఆర్ఎన్ఏ టీకాల తర్వాత మైకోకార్డిటిస్ (గుండె వాపు) వంటివి నమోదయ్యాయి, ముఖ్యంగా 30 ఏళ్లలోపు యువకుల్లో రెండవ డోస్ తర్వాత ఇది ఎక్కువగా కనిపించింది. అయితే, ఈ ప్రమాదం కంటే వ్యాక్సిన్ వల్ల వచ్చే రక్షణ ప్రయోజనాలే ఎక్కువని నిపుణులు తెలియజేస్తున్నారు.

## అసలు కారణాలు ఏమిటి?

పరిశోధనల ప్రకారం గుండెపోటులు పెరగడానికి ప్రధానంగా దీర్ఘకాలిక కొవిడ్ ప్రభావం, వైద్య చికిత్సలో జాప్యం, జీవనశైలిలో మార్పులు కారణం అని పరిశోధకులు చెప్తున్నారు. లాంగ్ కొవిడ్ ప్రభావితుల్లో.. వైరస్ ప్రభావం వల్ల రక్తనాళాల్లో వాపు, రక్తం గడ్డకట్టడం వంటి సమస్యలు తలెత్తుతాయి. కొవిడ్ బారిన పడి ఆసుపత్రిలో చేరిన వారికి గుండెపోటు వచ్చే అవకాశం 4 రెట్లు ఎక్కువ. మహమ్మారి సమయంలో రెగ్యులర్ చెకప్‌లు లేకపోవడం, చికిత్స ఆలస్యం కావడం వల్ల కూడా మరణాలు పెరిగాయి. పెరిగిన మానసిక ఒత్తిడి, తక్కువ శారీరక శ్రమ, ఆహారపు అలవాట్లు కూడా దీనికి దోహదం చేశాయి.

### భయం వద్దు.. అలసత్వం వలదు

కొవిడ్ అనంతర కాలంలో సంభవిస్తున్న ఆకస్మిక మరణాలు ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రతి గుండెపోటును వ్యాక్సిన్‌తో ముడిపెట్టడం శాస్త్రీయంగా సరైనది కాదు. వైరస్ వల్ల గుండెపై పడే దీర్ఘకాలిక ప్రభావమే అధిక ప్రమాదకరమని క్లైవెలాండ్ క్లినిక్ వంటి ప్రముఖ ఆరోగ్య సంస్థలు సూచిస్తున్నాయి. అయితే, తీవ్రమైన కొవిడ్ బారిన పడిన వారు అధిక శ్రమ కలిగించే వ్యాయామాలు, పరుగు వంటి వాటికి దూరంగా ఉండటమే మంచిది. ఛాతి నొప్పి, ఆయాసం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. ఒత్తిడి తగ్గించుకోవడం, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా గుండెను కాపాడుకోవచ్చు. శాస్త్రీయ ఆధారాలను పరిశీలిస్తే, టీకాలు మనల్ని వైరస్ నుంచి రక్షించాయే తప్ప మరణాలకు ప్రధాన కారణం కాలేదని స్పష్టమవుతోంది.

# ఎండ.. 43.3 డిగ్రీలు

మొదటి పేజీ తరువాయి

ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో సాధారణ స్థాయి కంటే 2 నుంచి 3 డిగ్రీలు ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ఉదయం 7 గంటల నుంచే ఎండ తీవ్రత పెరుగుతూ, మధ్యాహ్నం 12 వచ్చేటప్పటికీ అత్యధిక స్థాయికి చేరుతోంది. ఉదయం, రాత్రి ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేకంగా కార్మికులు, వృద్ధులు, చిన్నపిల్లలు ఎక్కువగా ఎండల వల్ల ఇబ్బందులు పడుతున్నారు. మరికొన్ని రోజుల పాటు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు రావొద్దని ప్రజలకు అధికారులు సూచిస్తున్నారు. ఎండల దృష్ట్యా మధ్యాహ్న సమయంలో ఎవరు బయటకు రావొద్దని మంత్రి సీతక్క సూచించారు. రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు బయట తిరగకుండా ఉంటే మంచిదని తెలిపారు. ఎలాంటి పనులు ఉన్నా ఉదయం 6 గంటల నుంచి 10 గంటల మధ్య పూర్తి చేసుకోవాలని సూచించారు. బయటకు రావాల్సి వస్తే టోపీ, తలపాగా వంటివి తప్పనిసరిగా ధరించాలన్నారు. ప్రస్తుతం ఎండలు భారీగా పెరిగాయని, వీటివల్ల ప్రమాదమనిర, అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని అన్నారు. అధికారులు గ్రామాలు, పట్టణాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పంచాయతీ స్థాయిలో తాగునీటి సౌకర్యాలను కల్పించాలని అధికారులకు సూచించారు. అలాగే, ఉపాధి హామీ కార్మికులకు ప్రత్యేక సూచనలు చేశారు. పనిస్థలాల్లో తాగునీటి వసతి ఏర్పాటు తప్పనిసరని తెలిపారు. ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో పని చేసే ప్రాంతాల్లో అవసరమైన జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు.

# జగిత్యాల లొల్లి హైదరాబాద్‌కు!

**సీఎంను కలిసిన కాంగ్రెస్ సీనియర్ నేతలు**
**సీనియర్లకు సరైన గుర్తింపు లేదని ఆవేదన**

జగిత్యాల, ఏప్రిల్ 14 (ఈవార్తలు): జగిత్యాల కాంగ్రెస్ నేతలకు ఎట్టకేలకు మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి అపాయింట్‌మెంట్ లభించింది. సోమవారమే సీఎం రేవంత్ రెడ్డితో భేటీ కావాల్సి ఉండగా, చివర్లో అపాయింట్‌మెంట్ క్యాన్సిల్ అయ్యింది. దీంతో ఒక్కసారిగా అంతర్గత విభేదాలు భగ్గుమన్నాయి. ఎట్టకేలకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సహకారంతో సీఎం అపాయింట్మెంట్ దొరకడంతో.. జగిత్యాల డీసీసీ అధ్యక్షుడు గాజెంగి నందయ్య ఆధ్వర్యంలో సుమారు 70 మంది కాంగ్రెస్ సీనియర్ నాయకులు హైదరాబాద్‌కు వచ్చారు. ఈ సందర్భంగా గాజెంగి నందయ్య మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ నాయకులు కష్టనష్టాలకు ఓర్చి పార్టీ బలోపేతానికి కృషి చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ సీనియర్ కాంగ్రెస్ నాయకులు సరైన గుర్తింపు లభించడం లేదని చెప్పారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, రాబోయే రోజుల్లో నామినేటెడ్ పోస్టుల భర్తీలో సీనియర్లకు సముచిత స్థానం కల్పించాలని కోరుతున్నట్లు పేర్కొన్నారు.

# లోక్‌సభ సీట్లు.. 850



మొదటి పేజీ తరువాయి

రోజుల పాటు ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ను అమలుతో పాటు డీలిమిటేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఈ సమావేశాల్లో చర్చించనున్నారు. పార్లమెంట్ ఉభయసభల్లో నియోజవర్గాల పునర్విభజన బిల్లు ఆమోదం పొందిన తర్వాత కేంద్రం డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటుచేస్తుంది. అనంతరం సీట్ల పెంపు ప్రక్రియను పూర్తిచేసి 2029 సార్వత్రిక ఎన్నికల్లో అమలు చేయనున్నట్లు సమాచారం. అయితే, దామాషా ప్రకారంఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు కూడా పెరిగే అవకాశం ఉంది. జనాభా లెక్కల ఆధారంగా దామాషా ప్రకారం నియోజకవర్గాల పెంపునకు అనుమతిస్తే ఉత్తర, దక్షిణాది మధ్య మరింత అంతరం ఏర్పడుతుందని ముందు నుంచి దక్షిణాది పార్టీలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో అన్ని రాష్ట్రంలో లోక్‌సభ, అసెంబ్లీ సీట్లు సగటున 50% పెంచాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా, కేంద్రం నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు సంబంధించి అధికారికంగా ప్రకటన చేయడంతో బుధవారం ఇండియా కూటమి పార్టీలు ఢిల్లీలో అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నాయి. దీంతో ఆ భేటీలో ఏం చర్చించనున్నారు? అనేది ప్రాధాన్యం సంతరించుకుంది.

## రాజ్యాంగ సవరణకు మెజారిటీ ఎంత?

ఇది రాజ్యాంగ సవరణ బిల్లు కాబట్టి, లోక్‌సభలో ఆమోదం కోసం మొత్తం సభ్యులలో మూడింట రెండు వంతుల (దాదాపు 362 మంది ఎంపీల) మద్దతు అవసరం. ప్రభుత్వం ఈ ప్రతిపాదనకు వివిధ రాజకీయ పార్టీల నుంచి మద్దతు లభిస్తుందని ఆశిస్తోంది. సీట్ల సంఖ్య పెంచడం ద్వారా మహిళా రిజర్వేషన్‌ను అమలు చేయడం సులభం అవుతుందని, ఇది ఒక ముఖ్యమైన అడుగుగా పరిగణిస్తున్నారు.

## దక్షిణాది వర్సెస్ ఉత్తరాది

నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన రాజకీయ వివాదం మరోసారి తీవ్రమైంది. కేంద్ర ప్రభుత్వం లోక్‌సభ సీట్ల పునర్విభజనకు సిద్ధమవుతుండగా, దక్షిణ భారత రాష్ట్రాల్లో ఆందోళనలు పెరుగుతున్నాయి. నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి రాజకీయ వివాదం మరోసారి తీవ్రమైంది. జనాభా ఆధారంగానే సీట్లు పునర్విభజించాలని ప్రభుత్వం సన్నాహాలు చేస్తుండగా, దక్షిణ భారత రాష్ట్రాల్లో ఆందోళనలు పెరుగుతున్నాయి.డీఎంకే నాయకుడు, తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఈ పునర్విభజన దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేస్తుందని వాదిస్తున్నారు. జనాభా నియంత్రణలో విజయం సాధించిన దక్షిణ రాష్ట్రాలు సీట్లు కోల్పోయే అవకాశం ఉందని, అదే సమయంలో ఉత్తర భారత రాష్ట్రాలు ఎక్కువ సీట్లు పొందే అవకాశం ఉందని, దీనివల్ల పార్లమెంటులో రాజకీయ సమతుల్యత దెబ్బతింటుందని అంటున్నారు.

## కారణాలివీ..

దక్షిణ రాష్ట్రాలు కుటుంబ నియంత్రణ, అభివృద్ధి, విద్యలో ముందుండి జనాభా వృద్ధి తగ్గించాయి. ఉత్తరాది రాష్ట్రాలు (యూపీ, బీహార్, రాజస్థాన్ మొదలగు రాష్ట్రాలు) జనాభా నియంత్రణ పాటించలేదు. జనాభా ఆధారంగా సీట్లు కేటాయిస్తే ఉత్తరాది రాష్ట్రాలు ఎక్కువ సీట్లు పొందవచ్చు (ఉదా: యూపీ ప్రస్తుత 80 సీట్లు – గణనల ప్రకారం ఎక్కువ పెరగవచ్చు). దక్షిణ రాష్ట్రాలు సీట్లు తగ్గకపోయినా (ప్రో–రాటా హామీ ఇచ్చారు), సాపేక్షంగా వాటి రాజకీయ బలం తగ్గుతుందని భయం. పార్లమెంటులో ఉత్తరాది రాష్ట్రాల ప్రాబల్యం పెరిగి, దక్షిణాది రాష్ట్రాలు (ఆర్థికంగా, అభివృద్ధిలో ముందుండి) తమ స్వరం తగ్గుతుందని వాదిస్తున్నాయి. అయితే, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈ ఆందోళనలను తోసిపుచ్చారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదని, ప్రో–రాటా (నిష్పత్తి) ప్రాతిపదికన ఎవరి సీట్లు తగ్గవని, ఏ సీట్లు కోల్పోవని పేర్కొన్నారు. ఆర్టికల్ 82 ప్రకారం జనాభా లెక్కల ఆధారంగా సీట్లు, సరిహద్దులు తిరిగి నిర్ణయించనున్నట్లు స్పష్టం చేశారు.

# కేంద్రప్రభుత్వంపై కాలు దువ్వుదాం

మొదటి పేజీ తరువాయి

కచ్చితంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలకు భారీగా అన్యాయం జరుగుతుందని స్టాలిన్‌కు రాసిన లేఖలో రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. గత కొన్ని దశాబ్దాలుగా దక్షిణాది రాష్ట్రాలు.. జనాభా నియంత్రణలో కఠిన చర్యలు చేపట్టి.. జనాభా విస్ఫోటనాన్ని అడ్డుకున్నాయని.. ఇప్పుడు అదే పార్లమెంట్‌లో దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యం తగ్గే ప్రమాదం పొంచి ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే డీలిమిటేషన్ విషయంలో దక్షిణాది రాష్ట్రాల గొంతుకను బలంగా వినిపించాల్సిన అవసరం ఉందని.. దానికి సమయం కూడా వచ్చిందని రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ విషయంలో దక్షిణాది రాష్ట్రాలు అన్నీ కలిసి పోరాడాలని ఆ లేఖలో పేర్కొన్నారు. తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలు మాత్రమే కాకుండా ఇతర దక్షిణాది రాష్ట్రాలైన కేరళ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల సీఎంలతో కూడా సమన్వయం చేసుకుంటూ అంతా కలిసి ఒక ఉమ్మడి కార్యాచరణను తయారు చేయాల్సిన అవసరం ఉందని రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు. ఇక ఈ నియోజకవర్గాల పునర్విభజన అంశాన్ని కేవలం దక్షిణాది రాష్ట్రాల స్థాయిలోనే కాకుండా.. పార్లమెంట్‌లో కూడా గట్టిగా లేవనెత్తాలని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి సూచించారు. దక్షిణాది రాష్ట్రాల నుంచి ప్రాతినిధ్య వహిస్తున్న ఎంపీలు అందరూ కలిసి.. దక్షిణాదికి జరుగుతున్న అన్యాయంపై కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో దక్షిణాది రాష్ట్రాల మధ్య సమన్వయం చాలా అవసరమని గుర్తు చేశారు. ప్రస్తుత విధానంలో లోక్‌సభ సీట్ల పెంపును చేపడితే.. దక్షిణాదికి ప్రాధాన్యత తగ్గే అవకాశం ఉందని.. దీనిపై ఇతర సీఎంలతో భేటీ అయ్యి ఉమ్మడి పోరాటం చేయడం అవసరమని రేవంత్ రెడ్డి తన అభిప్రాయాన్ని వెల్లడించారు.

# జీవన్ రెడ్డికి ఏం తక్కువ చేసినం?

మొదటి పేజీ తరువాయి

రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో జీవన్ రెడ్డి గెలుపు కోసం పార్టీ శ్రేణులన్నీ కష్టపడ్డాయని, పార్లమెంట్ ఎన్నికల్లో కూడా ఆయన కోరిక మేరకే నిజామాబాద్ టికెట్ ఇచ్చామని సీఎం గుర్తు చేశారు. “దురదృష్టవశాత్తు ఆయన ఓడిపోయారు. అయినప్పటికీ ఆయనకు, ఆయన కుటుంబ సభ్యులకు రాజకీయ భవిష్యత్తుపై తాను స్వయంగా హామీ ఇచ్చాను. కానీ ఆయన మొండి పట్టుతో పార్టీని వీడి, 40 ఏళ్లుగా తన కోసం పనిచేసిన కార్యకర్తలను మోసం చేశారు.” అని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకున్న ప్రభుత్వాన్ని పడగొడతామని కుట్రలు చేస్తున్న కేసీఆర్ చెంతకు జీవన్ రెడ్డి చేరడం అత్యంత బాధాకరమని ఆయన అన్నారు. జగిత్యాల కాంగ్రెస్ కార్యకర్తల ఆత్మగౌరవాన్ని జీవన్ రెడ్డి కేసీఆర్ కాళ్ల దగ్గర తాకట్టు పెట్టారని సీఎం మండిపడ్డారు. ఆయన వయసుకి, అనుభవానికి ఇది ఏమాత్రం తగదని హితవు పలికారు. ప్రభుత్వాన్ని కూల్చాలనే కుట్రలను తాము తిప్పికొడుతుంటే, అటువైపు వెళ్లిన జీవన్ రెడ్డి నిర్ణయం మంచో చెడో కార్యకర్తలే ఆలోచించాలని కోరారు. “ప్రభుత్వాన్ని కాపాడుకోవడం తప్పా? నేను చేస్తున్నది తప్పో ఒప్పో మీరే నిర్ణయించండి. ఎవరు ఏమిటి అనేది కాలమే నిర్ణయిస్తుంది” అని ఆయన పేర్కొన్నారు. వ్యక్తి కంటే పార్టీయే ముఖ్యమని నిరూపిస్తూ కాంగ్రెస్ వెంట నడుస్తున్న కార్యకర్తలను ఆయన మనస్ఫూర్తిగా అభినందించారు. కార్యకర్తలు ఎవరూ అధైర్యపడొద్దని, త్వరలోనే తాను వ్యక్తిగతంగా జగిత్యాలకు వచ్చి అందరినీ కలుస్తానని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. అంతా కలిసికట్టుగా జగిత్యాల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. కుట్రలను ఎదుర్కొంటూ మళ్లీ కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని కోరారు. రాజకీయాల్లో ఆరోపణలు, ప్రత్యారోపణలు సహజమని, కానీ సిద్ధాంతాల కోసం నిలబడటమే

# కాంగ్రెస్ వైఫల్యాలపై జంగ్ సైరన్

## 20న జగిత్యాలలో కేసీఆర్ సభ.. 27న బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు

**మే, జూన్‌లో ప్రత్యక్ష పోరాటాలు**

**కేటీఆర్ కీలక ప్రకటన**

హైదరాబాద్, ఏప్రిల్ 14 (ఈవార్తలు): వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ తన భవిష్యత్ కార్యాచరణను ప్రకటించింది. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కాంగ్రెస్ ప్రభుత్వంపై రాబోయే పోరాటాల గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. ఏప్రిల్ 20న జగిత్యాలలో నిర్వహించే బహిరంగ సభకు పార్టీ అధినేత కేసీఆర్ హాజరుకానున్నారని కేటీఆర్ తెలిపారు. అనంతరం ఏప్రిల్ 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించబోతున్నట్టు వెల్లడించారు. మే, జూన్ నెలల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రత్యక్ష పోరాటాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ



వర్గాల సమస్యలపై తొలుత దృష్టి సారించబోతున్నట్లు స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన డిక్లరేషన్లను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని ఆయన విమర్శించారు. ఏయే ప్రాంతాల్లో ఏయే హామీలు ఇచ్చారో, తిరిగి అదే ప్రాంతాల్లో సభలు పెట్టి ప్రజలకు వాస్తవాలను వివరిస్తామని తెలిపారు. అంబేద్కర్ ఆశయాలను కాంగ్రెస్ పార్టీ కేవలం రాజకీయాల కోసమే వాడుకుందని మండిపడ్డారు. అంబేద్కర్ పార్లమెంటుకు వెళ్లకుండా అడ్డుకోవడమే కాకుండా, ఆయనకు భారతరత్న ఇవ్వడంలోనూ, పార్లమెంటులో ఫొటో పెట్టడంలోనూ కాంగ్రెస్ నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టిన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని సందర్శించకుండా గేట్లు వేస్తే, తాము హెచ్చరించిన తర్వాతే గేట్లు తెరుచుకున్నాయని గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ఎస్సీ, ఎస్టీలు మోసపోయారని, వెయ్యికి పైగా గురుకులాల్లో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఈ అరాచక పాలనపై బీఆర్ఎస్ గట్టిగా నిలదీస్తుందని అన్నారు.

# తెలుగోళ్లను బంట్రోతులుగా చూసిందే కాంగ్రెస్

**రేవంత్ రెడ్డి 'బంట్రోతు' వ్యాఖ్యలకు కిషన్ రెడ్డి కౌంటర్**

హైదరాబాద్, ఏప్రిల్ 14 (ఈవార్తలు): నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లులపై ఆయన మీడియాతో మాట్లాడుతూ, పునర్విభజన జరిగితే ఇప్పుడు వచ్చిన కేంద్రమంత్రి పదవులు కూడా రాబోవని, బంట్రోతులుగా మారుతారని రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై అసహనం వ్యక్తం చేశారు. తెలుగు ప్రజలను బంట్రోతులుగా చూసిందే కాంగ్రెస్ పార్టీ అని విమర్శించారు. అంజయ్య, ఇతర ముఖ్యమంత్రులను కాంగ్రెస్ పార్టీ ఎలా అవమానించిందో అందరికీ తెలుసని అన్నారు. జనాభా ప్రాతిపదికన పెంచితే దక్షిణాదికి నష్టమని ఇన్నాళ్లు అన్నారని, ప్రతి రాష్ట్రంలో కనీసం 50 శాతం సీట్లు పెంచుతుంటే కూడా



రాద్ధాంతం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దక్షిణాదికి బీజేపీ కీలక పదవులు ఇవ్వలేదని రేవంత్ రెడ్డి చెప్పిన వ్యాఖ్యలపై కిషన్ రెడ్డి స్పందించారు. ఉపరాష్ట్రపతి పదవులు చేపట్టిన వెంకయ్యనాయుడు, సీపీ రాధాకృష్ణన్ దక్షిణాదివాళ్లు కాదా అని ప్రశ్నించారు. ఎంపీ లక్ష్మణ్ ఉత్తరాదికి వలసపోతారని విమర్శించడం విడ్డూరంగా ఉందని అన్నారు. రాహుల్ గాంధీ ఉత్తరప్రదేశ్ వదిలిపెట్టి కేరళకు రాలేదా అని నిలదీశారు. దక్షిణాది ముఖ్యమంత్రులు ఢిల్లీకి వెళితే రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. ప్రస్తుతం తెలంగాణ నుంచి రేవంత్ రెడ్డి పంపించే డబ్బుతోనే కాంగ్రెస్ పార్టీ నడుస్తోందని విమర్శించారు. జనాభా ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన చేస్తే దక్షిణాది నష్టపోతుందనే ఆలోచనతో మోదీ రాష్ట్రాలకు కనీసం 50 శాతం సీట్లు పెంపు ప్రతిపాదన తీసుకువచ్చారని తెలిపారు. కానీ గతంలో ఉత్తరాది రాష్ట్రాలకు ఎక్కువ సీట్లు కేటాయించింది కాంగ్రెస్ పార్టీయేనని ఆరోపించారు. ఈసారి జనగణనతో పాటు కులగణన చేస్తున్నట్లు చెప్పారు. దీనికి సమయం తీసుకుంటుందని కిషన్ రెడ్డి అన్నారు.

# డీలిమిటేషన్-మహిళా బిల్లులకు లింకు పెట్టొద్దు

**ప్రధాని మోదీకి**

**సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ లేఖ**

హైదరాబాద్, ఏప్రిల్ 14 (ఈవార్తలు): లోక్ సభ నియోజకవర్గాల పెంపు, మహిళా రిజర్వేషన్ బిల్లులపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ లేఖ రాశారు. లోక్ సభ నియోజకవర్గాల పెంపుపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని సూచించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుతో నియోజకవర్గాల పునర్విభజనను ముడిపెట్టవద్దని కోరారు. ఈ లేఖలో ఆయన మూడు అంశాలను ప్రస్తావించారు. మహిళా బిల్లుకు సంపూర్ణ మద్దతు పలుకుతున్నట్లు తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలకు, చిన్నరాష్ట్రాలకు అన్యాయం జరిగేలా నియోజకవర్గాల పెంపు ఉందంటూ అభ్యంతరం వ్యక్తం చేశారు. చివరగా మహిళా బిల్లుకు, పునర్విభజన బిల్లుకు లంకె పెట్టవద్దని కోరారు. లోక్ సభ నియోజకవర్గాల పునర్విభజన బిల్లు ద్వారా దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా చూడాలని కోరారు. నియోజకవర్గాల పెంపు వంటి కీలక నిర్ణయాలు తీసుకునే ముందు అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఇందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని అన్నారు. జనాభా ప్రాతిపదికన మాత్రమే నియోజకవర్గాల పునర్విభజన చేపడితే జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయని అన్నారు.

# కేటీఆర్.. కవిత ప్రశ్నలకు జవాబేది?

**టీపీసీసీ మహేశ్ గౌడ్ ధ్వజం**

హైదరాబాద్, ఏప్రిల్ 14 (ఈవార్తలు): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై, ఆ పార్టీ అగ్రనేతలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం దోపిడీకి గురైందని ఆయన ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు పదవులు కోల్పోయి విలవిలలాడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాదయాత్ర చేస్తాననడంపై స్పందిస్తూ... ఆయన ఏం చేసినా రాష్ట్ర ప్రజలు బీఆర్ఎస్‌ను క్షమించే పరిస్థితి లేదని అన్నారు. పదేళ్లలో చేసిన అరాచకాలపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని పేర్కొన్నారు.

# 70 నియోజకవర్గాల్లో సమీకృత గురుకులాలు

**విద్యా వ్యవస్థను బలోపేతం చేసున్నాం: మంత్రి పొంగులేటి**

సత్తుపల్లి, ఏప్రిల్ 14 (ఈవార్తలు): రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గం, కల్లూరు మండలం చెన్నూరులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... మొదటి విడతలో 70 నియోజకవర్గాల్లో రూ. 200 కోట్లతో ఈ సమీకృత గురుకుల పాఠశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని మంత్రి వెల్లడించారు. ఈ ప్రాజెక్టులు కేవలం శిలాఫలకాలకే పరిమితం కాకుండా, నిర్ణీత సమయంలోగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కల్లూరును ప్రత్యేక నియోజకవర్గంగా మార్చడం అనేది కేంద్ర ప్రభుత్వం చేపట్టే నియోజకవర్గాల పునర్విభజన సమీకరణలపై ఆధారపడి ఉంటుందని వివరించారు. సత్తుపల్లి ప్రాంతంలో మూడు పెద్ద ఆసుపత్రులు ఏర్పాటు చేయబోతున్నామని, పెండింగ్‌లో ఉన్న ఆసుపత్రుల నిర్మాణాలను పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. ఆర్థిక సవాళ్లు ఎదురైనా రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500 బోనస్ వంటి పథకాలకు, విద్య, వైద్యానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తోందని చెప్పారు.

# తప్పుడు ప్రచారంపై చర్యలు తీసుకోండి

హైదరాబాద్, ఏప్రిల్ 14 (ఈవార్తలు): హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్‌ను సినీ గాయని మంగ్లీ కలిశారు. అడ్వకేట్ సుబ్బారావుకు, మంగ్లీకి మధ్య వివాదం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో, మైక్రోఫైనాన్స్ స్కామ్ ఆరోపణల నేపథ్యంలో తనపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని అడ్డుకోవాలని కోరుతూ మంగ్లీ తాజాగా సీపీ సజ్జనార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. మైక్రోఫైనాన్స్ పేరుతో తాను, తన తమ్ముడు మోసాలకు పాల్పడ్డామన్న సుబ్బారావు ఆరోపణలను ఈ సందర్భంగా మంగ్లీ ఖండించారు. తనపై తప్పుడు ప్రచారం చేస్తున్న సుబ్బారావుపై కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే మోసపోయిన బాధితులకు న్యాయం చేసి అసలు దోషులను పట్టుకోవాలని కోరారు. గత నెల 22న సుబ్బారావు తనను కలిసి, సోషల్ మీడియాలో ఉన్న నెగెటివ్ వీడియోలను తొలగించాలంటే రూ. 10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారని మంగ్లీ ఆరోపించారు. అందుకు తాను నిరాకరించడంతోనే ఈ వేధింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. తనకు పాటలు తప్ప వేరే వ్యాపారాలు లేవని, డబ్బుల కట్టలతో ఉన్న వీడియోలో ఉన్నది తన తమ్ముడు కాదని మంగ్లీ స్పష్టం చేశారు. ఒకవేళ తన తప్పు ఉందని నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధమని సవాల్ విసిరారు. సుబ్బారావు కేవలం ఫేమస్ కావడానికే తన పేరును వాడుకుంటున్నారని మంగ్లీ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

*అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.*

**- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్**

**సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.**

# నేడు ఢిల్లీకి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 14 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సాయంత్రం దేశ రాజధాని ఢిల్లీకి వెళ్లనున్నారు. ఈ పర్యటన జాతీయ రాజకీయాల్లో, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాల దృష్ట్యా అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.






## మల్యాలలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

మల్యాల, ఏప్రిల్ 14 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రంలో అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, యువత పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ, అంబేద్కర్ చూపిన మార్గం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని తెలిపారు. కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## శ్రీరాంపురంలో రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళి

కాకినాడ, ఏప్రిల్ 14 (ఈవార్తలు): ఏపీలోని కాకినాడ జిల్లా శ్రీరాంపురంలో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌కు ఘన నివాళి అర్పించారు. 135వ జయంతి సందర్భంగా వేడుకలను గ్రామపంచాయతీ సెక్రటరీ సోమేశ్వర రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేడుకలో కూటమి నాయకులు, మాల మహా నాయకులు, యూత్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అంబేద్కర్ గారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అంబేద్కర్ సేవలను, భారత రాజ్యాంగ నిర్మాణంలో పాత్రను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది అంగన్వాడీ వర్కర్స్, గ్రామ ప్రజలు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు



## సమానత్వం కోసం పోరాడిన మహనీయుడు: జీవన్ రెడ్డి

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 14 (ఈవార్తలు): అంబేద్కర్ జయంతి సందర్భంగా జగిత్యాల జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ చౌరస్తా, గాంధీనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం జీవన్ రెడ్డి మాట్లాడుతూ, అంబేద్కర్ సమానత్వం, సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడని అన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి, మాజీ ఫ్లోర్ లీడర్ దుర్గయ్య, సర్పంచ్ సతీశ్, కౌన్సిలర్లు రాజశేఖర్, ప్రదీప్, మాజీ కౌన్సిలర్లు పుప్పాల అశోక్, నక్క జీవన్, బొల్లి శేఖర్, రాధకిషన్ తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాల నుంచే కేసీఆర్ జైత్రయాత్ర

**రేవంత్ పోవాలి.. కేసీఆర్ రావాలి**

**జీవన్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు**

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 14 (ఈవార్తలు): జగిత్యాల నుంచే కేసీఆర్ జైత్రయాత్ర ప్రారంభమవుతుందని, ఆయనతో కలిసి పని చేయడం అదృష్టంగా భావిస్తున్నానని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. పట్టణంలోని జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్ రావు నివాసంలో జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి పాల్గొన్న ఆయన, కేసీఆర్ తెలంగాణ ఉద్యమ సారథిగా రాష్ట్ర నిర్మాణానికి కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. రైతు సంక్షేమం కోసం రైతుబంధు, రైతు బీమా వంటి పథకాలు ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. తెలంగాణలో నీటి వనరుల అభివృద్ధితో వ్యవసాయం బలపడిందని, గోదావరి జలాలను వినియోగించేందుకు బ్యారేజీలు నిర్మించారని తెలిపారు. ప్రస్తుతం వాటి మరమ్మతుల విషయంలో నిర్లక్ష్యం జరుగుతోందని విమర్శించారు.



ప్రజల్లో కేసీఆర్ నాయకత్వంపై విశ్వాసం పెరిగిందని, మళ్లీ ఆయన పాలన రావాలనే ఆకాంక్ష వ్యక్తమవుతోందన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం బీఆర్ఎస్ అధికారంలోకి రావాలని పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ నాయకులు మాట్లాడుతూ జీవన్ రెడ్డి రాకతో బీఆర్ఎస్‌కు బలమైన అండ లభించిందని, ఆయనతో కలిసి పనిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

# జగిత్యాలలో ఘనంగా అంబేద్కర్ జయంతి

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 14 (ఈవార్తలు): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాలను జగిత్యాలలో ఘనంగా నిర్వహించారు ఈ వేడుకలను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ లతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి గజమాల వేసి అనంతరం ఏర్పాటు చేసిన వేదిక వద్ద గల అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన గావించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ దేశానికి అందించిన రాజ్యాంగం ప్రపంచంలోనే గొప్పదని పేర్కొన్నారు. సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం అనే మూల విలువలను రాజ్యాంగం ద్వారా దేశ ప్రజలకు అందించారని తెలిపారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ అంబేద్కర్ ఆలోచనలను ఆచరణలో పెట్టాలని సూచించారు. యువత విద్యను సాధనంగా తీసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. సామాజిక న్యాయం



సాధించడంలో ప్రతి పౌరుడి పాత్ర కీలకమని తెలిపారు. రాజ్యాంగం ద్వారానే ఏర్పడిన ప్రభుత్వాలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందరికీ చేరేలా చర్యలు తీసుకుంటున్నాయని చెప్పారు. ప్రజలందరూ కలిసిమెలిసి ఉండి రాజ్యాంగ విలువలకు కట్టుబడి రాజ్యాంగం అందించిన అవకాశాలను ఉపయోగించుకొని వ్యక్తిగతంగా ఎదిగి జగిత్యాల జిల్లాను అన్ని రంగాల్లో ముందు వరుసలో ఉంచాలని కోరారు.



## జగిత్యాల బార్ అసోసియేషన్ నూతన కమిటీకి సన్మానం

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 14 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా బార్ అసోసియేషన్ నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని జిల్లా తొలి జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె నివాసంలో జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్ర నర్సయ్య, జనరల్ సెక్రటరీ అందే మారుతి, వైస్ ప్రెసిడెంట్ మారిపెల్లి సత్యప్రకాశ్, జాయింట్ సెక్రటరీ బెజ్జరపు ప్రవీణ్ కుమార్, ట్రెజరర్ జున్ను రాజేందర్, స్పోర్ట్స్ ఒ కల్చరల్ సెక్రటరీ ఎం.డి. సలీం, ఏజీపీ ఓంప్రకాశ్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శీలం ప్రవీణ్, చిట్ల రమణ, సారంగపూర్ మండల అధ్యక్షుడు తేలు రాజు తదితరులు పాల్గొన్నారు.



## నిజామాబాద్ హైవేపై ట్రాఫిక్ మళ్లింపు

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 14 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని నిజామాబాద్ హైవేపై మంచినీళ్ల బావి వద్ద వంతెన నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ రద్దీ, ప్రమాదాలను నివారించేందుకు ప్రత్యేక మళ్లింపులు అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. పనులు జరుగుతున్న ప్రాంతాన్ని ఎస్పీ స్వయంగా పరిశీలించి, వాహన రాకపోకలకు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ట్రాఫిక్ సజావుగా నడిచేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలు, వాహనదారులు పోలీసుల సూచించిన ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నిర్మాణ ప్రాంతంలో హెచ్చరిక బోర్డులు, బ్యారికేడ్లు, రాత్రి వేళ రిఫ్లెక్టివ్ సిగ్నల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



## అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 14 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఏప్రిల్ 14 నుండి 20వ తేదీ వరకు నిర్వహించనున్న అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమాల్లో భాగంగా పోస్టర్‌ను ఈరోజు జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ తమ నివాసంలో ఆవిష్కరించారు. తెలంగాణ ఫైర్ డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ మరియు సివిల్ డిఫెన్స్ విభాగం ఆధ్వర్యంలో ప్రజల్లో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించేందుకు వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారి మరియు సిబ్బంది పాల్గొన్నారు. అలాగే డీసీసీ జిల్లా అధ్యక్షులు గాజంగి నందయ్య, ఇతర నాయకులు హాజరయ్యారు.



## మహిళల పెన్నిధి అంబేద్కర్: అడువాల జ్యోతి

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 14 (ఈవార్తలు): అంబేద్కర్ జయంతి సందర్భంగా జగిత్యాలలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ మాట్లాడుతూ, మహిళల సమాన హక్కుల కోసం అంబేద్కర్ చేసిన కృషి అమూల్యమని అన్నారు. మహిళల విద్యతో సమాజం అభివృద్ధి చెందుతుందని పేర్కొంటూ, ప్రతి అమ్మాయి స్వయం ప్రతిపత్తి సాధించాలని సూచించారు. మహిళలపై వివక్షను తొలగించడం అందరి బాధ్యత అని చెప్పారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

## ఏపీ ఇంటర్ ఫలితాలు నేడే విడుదల

విజయవాడ, ఏప్రిల్ 14 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్మీడియట్ విద్యార్థుల నిరీక్షణకు తెరపడనుంది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షల ఫలితాలు బుధవారం విడుదల కానున్నాయి. ఉదయం 10:31 గంటలకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఈ ఫలితాలను అధికారికంగా విడుదల చేయనున్నారు. ఈ విషయాన్ని మంత్రి స్వయంగా సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ఫలితాలను సులభంగా, వేగంగా తెలుసుకునేందుకు ప్రభుత్వం రెండు మార్గాలను అందుబాటులోకి తెచ్చింది. విద్యార్థులు తమ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు. దీనితో పాటు, సాంకేతికతను ఉపయోగించుకుంటూ తొలిసారిగా వాట్సాప్ ద్వారా కూడా ఫలితాలను పొందే సరికొత్త సదుపాయాన్ని కల్పించారు. 'మన మిత్ర' పేరుతో ఏర్పాటు చేసిన వాట్సాప్ సేవలను పొందడానికి, విద్యార్థులు 9552300009 అనే నంబర్‌కు 'హై' అని మెసేజ్ పంపితే చాలు. సెకన్ల వ్యవధిలోనే వారి ఫలితాలు వాట్సాప్‌కు వస్తాయి. ఈ విధానం ద్వారా విద్యార్థులు ఎలాంటి క్యూలలో నిలబడకుండా, సర్వర్ సమస్యలు లేకుండా సులువుగా ఫలితాలు తెలుసుకోవచ్చని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ, "ఇది మీ క్షణం.. ముందుకు సాగి ప్రకాశించండి" అని లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు.


## ట్రోలింగ్ అంతా ఆర్గనైజ్డ్ క్రైమ్: మార్గాని భరత్

తాడేపల్లి, ఏప్రిల్ 14 (ఈవార్తలు): ఏపీలో కూటమి ప్రభుత్వంపై వైసీపీ నేత, మాజీ ఎంపీ మార్గాని భరత్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. జయంతికి, వర్ధంతికి తేడా తెలియని నారా లోకేశ్... 'రెడ్ బుక్' పేరుతో రాష్ట్రంలో అల్లకల్లోలం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. జగన్ కుటుంబ సభ్యులపై సోషల్ మీడియాలో ఉన్మాదం అనదగ్గ రీతిలో ట్రోలింగ్ జరుగుతోందని అన్నారు. ఫేక్ ఛానల్స్‌తో జగన్ కుటుంబాన్ని టార్గెట్ చేశారని మండిపడ్డారు. సోషల్ మీడియాలో 'ఆర్గనైజ్డ్ క్రైమ్' జరుగుతోందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నారా లోకేశ్ కు ఒకటే చెబుతున్నా... అధికారం ఎప్పుడూ శాశ్వతం కాదు... చట్టం ఎవరికీ చుట్టం కాదు... భవిష్యత్తులో ఆ చట్టం మీ మెడకే చుట్టుకుంటుంది అని హెచ్చరించారు. అమరావతి నిర్మాణం కోసం రూ. 2 లక్షల కోట్లు అప్పులు చేయడం అసాధ్యమని, అందుకే వైఎస్ జగన్ 'మావిగన్' ప్రతిపాదన తెచ్చారని భరత్ స్పష్టం చేశారు. నీళ్లు ఎత్తిపోసే రాజధాని ప్రపంచంలో అమరావతి ఒక్కటేనని ఎద్దేవా చేశారు. జనం లేని అమరావతి కంటే, అన్ని వసతులు ఉన్న మావిగన్‌లో రాజధాని నిర్మించడమే ఉత్తమమని ప్రజల్లో చర్చ జరుగుతోందని పేర్కొన్నారు. అమరావతిలో రాజధాని కడితే అది నయా రాయపూర్, గాంధీనగర్ లాగా మారుతుందని, సాయంత్రం అయితే అధికారులు విజయవాడకు వెళ్లిపోతారని, అక్కడ ఎవరూ ఉండరని భరత్ వ్యాఖ్యానించారు. మంత్రులకు సింగపూర్‌లో శిక్షణా తరగతులు నిర్వహించాలనుకోవడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు.

## క్వాంటం రంగంలో ఏపీ పయనీర్

**టెస్ట్‌బెడ్‌లను జాతికి అంకితం చేసిన చంద్రబాబు**

అమరావతి, ఏప్రిల్ 14 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం టెక్నాలజీ రంగంలో సరికొత్త చరిత్రను లిఖించింది. ప్రపంచ క్వాంటం దినోత్సవం, అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని దేశంలోనే తొలి క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీలను రాష్ట్రంలో ఆవిష్కరించారు. అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో '1ఎస్', గన్నవరంలోని మేధా టవర్స్‌లో '1క్యూ' పేరిట ఏర్పాటు చేసిన క్వాంటం హార్డ్‌వేర్ టెస్ట్‌బెడ్‌లను ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం జాతికి అంకితం చేశారు. ఈ చరిత్రాత్మక కార్యక్రమంతో ఆంధ్రప్రదేశ్, క్వాంటం కంప్యూటింగ్ ఉపకరణాలను పరీక్షించి, ధ్రువీకరించే సామర్థ్యం కలిగిన తొలి రాష్ట్రంగా అవతరించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, క్వాంటం సైన్స్ వందేళ్లు పూర్తి చేసుకున్న వేళ, ప్రపంచ క్వాంటం దినోత్సవాన ఈ ఫెసిలిటీలను ప్రారంభించుకోవడం ద్వారా చరిత్ర సృష్టించామని అన్నారు. "విజ్ఞానమే సామాజిక ప్రగతికి చిహ్నం అని చెప్పిన అంబేద్కర్ గారి జయంతి నాడు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించుకోవడం సంతోషంగా ఉంది. ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో 1ఎస్ ఓపెన్ యాక్సెస్ క్వాంటం ఫెసిలిటీ, మేధా టవర్స్‌లో 1క్యూ క్వాంటం సిస్టమ్‌ను ఏర్పాటు చేశాం. ఈ టెస్ట్‌బెడ్‌లను పరిశోధకులకు, కంపెనీలకు, విద్యార్థులకు అందుబాటులో ఉంచుతున్నాం" అని తెలిపారు. భారత తొలి ఓపెన్ యాక్సెస్ క్వాంటం ఫెసిలిటీలకు, అమరావతి క్వాంటం వ్యాలీ ఏర్పాటుకు ప్రోత్సహిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, కార్యదర్శి అభయ్ కరాందికర్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు.



# నావి హామీలు.. మోసాలు కావు

## నన్ను నమ్మండి.. అండగా ఉంటా.. తమిళనాడు ఓటర్లపై విజయ్ వేడుకోలు



చెన్నై: మిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు, ప్రముఖ నటుడు విజయ్.. తన ఎన్నికల ప్రచారంలో హామీల వర్షం కురిపించారు. తమిళనాడు రాజకీయాల్లో కీలకమైన కొంగు ప్రాంతంలోని టెక్స్‌టైల్ హబ్‌గా పేరుగాంచిన తిరుప్పూర్‌లో మంగళవారం జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులు, రైతులు, చిన్న మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ), ప్రభుత్వ ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని పలు కీలక సంక్షేమ పథకాలను ప్రకటించారు. తమ పార్టీ పూర్తిస్థాయి ఎన్నికల మేనిఫెస్టోను ఏప్రిల్ 16న పుస్తక రూపంలో విడుదల చేస్తామని వెల్లడించారు. అయితే, అంతకంటే ముందే ప్రజల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో కొన్ని "ప్రాధాన్యత హామీలను" ఆయన ప్రజల ముందుంచారు. ముఖ్యంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న చేనేత రంగానికి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చిన విజయ్, ఈ రంగానికి పలు కీలక హామీలు ప్రకటించారు. చేనేత కార్మికులు తమ ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లలో నేరుగా విక్రయించుకునేందుకు ప్రత్యేకంగా ఒక ఈ-కామర్స్ బ్రాండ్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. చేనేత మగ్గాలు లేదా పవర్‌లూమ్‌లు ఉన్న ప్రతి కుటుంబానికి, పెరుగుతున్న ముడిసరుకుల ధరలు, విద్యుత్ సవాళ్లను అధిగమించేందుకు ఏటా రూ. 30,000 ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. చేనేత యూనిట్లకు 500 యూనిట్ల వరకు, పవర్‌లూమ్‌లకు 1,500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందిస్తామన్నారు. ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించేందుకు నూలు, రంగులపై 50 శాతం సబ్సిడీ ఇస్తామని ప్రకటించారు. ప్రతి చేనేత కార్మికుడికి రూ. 10 లక్షల జీవిత బీమా కవరేజీ కల్పిస్తామన్నారు. చేనేత కార్మికుల నెలవారీ పింఛనును రూ. 3,000కు పెంచుతామని హామీ ఇచ్చారు. చిన్న పరిశ్రమలపై విద్యుత్ టారిఫ్‌ల భారాన్ని కూడా తగ్గిస్తామని విజయ్ హామీ ఇచ్చారు. ఎంఎస్ఎంఈల కోసం పీక్-అవర్ విద్యుత్ ఛార్జీలను తాత్కాలికంగా నిలిపివేస్తామని, టెక్స్‌టైల్ రంగ పునరుద్ధరణకు మద్దతుగా ఐదేళ్లపాటు 100% విద్యుత్ పన్ను మినహాయింపు ఇస్తామని ప్రకటించారు. వ్యవసాయ రంగంపై దృష్టి సారిస్తూ, ఐదెకరాల లోపు భూమి ఉన్న రైతులకు పూర్తిస్థాయిలో వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తామని విజయ్ హామీ ఇచ్చారు. అంతకంటే ఎక్కువ భూమి ఉన్న రైతులకు 50 శాతం రుణమాఫీ వర్తిస్తుందని తెలిపారు. వరి సేకరణ ధరను క్వింటాల్‌కు రూ. 3,500కు, చెరకు ధరను టన్నుకు రూ. 4,500కు పెంచుతామన్నారు. ప్రతి రైతు కుటుంబానికి ఏటా రూ. 10,000 ఆర్థిక సాయం అందిస్తామని కూడా వాగ్దానం చేశారు. పరిపాలనాపరమైన హామీలను కూడా విజయ్ ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగుల కోసం పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించే అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఐదేళ్లకు పైగా సర్వీసులో ఉన్న తాత్కాలిక సిబ్బందిని పర్మినెంట్ చేస్తామన్నారు. పోలీసు శాఖలో ప్రమోషన్లలో అవినీతిని నిర్మూలించి, పారదర్శక బదిలీలు చేపడతామని స్పష్టం చేశారు. పోలీసు సిబ్బందికి జీతాల పెంపు, సంక్షేమ ఆసుపత్రులు, మహిళా అధికారులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. తన హామీలన్నీ నిజాయతీతో కూడినవని, మోసపూరితమైనవి కావని ప్రజలు తనను నమ్మాలని విజయ్ కోరారు. తమిళనాడు రాజకీయాల్లో ఒక "విజిల్ విప్లవం" తీసుకురావడానికి తనకు మద్దతివ్వాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

## నితీశ్ రాజీనామా

**బీహార్ నూతన ముఖ్యమంత్రిగా సామ్రాట్ చౌదరి**

**బీజేపీ శాసనసభా పక్ష నేతగా ఎన్నికైన సామ్రాట్ చౌదరి**

**నేడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం**

పాట్నా: జేడీయూ అధినేత నితీశ్ కుమార్ బీహార్ ముఖ్యమంత్రిగా తన పదవికి రాజీనామా చేశారు. బుధవారం లోక్‌భవన్ చేరుకున్న ఆయన తన రాజీనామా పత్రాన్ని గవర్నర్‌కు అందజేశారు. రాజీనామాను సమర్పించడానికి ముందు ఆయన మంత్రివర్గ సమావేశాన్ని చివరిసారిగా ఏర్పాటు చేశారు. మంత్రివర్గాన్ని రద్దు చేస్తున్న విషయాన్ని కేబినెట్‌కు తెలియజేశారు. నితీశ్ కుమార్ బీహార్ ముఖ్యమంత్రిగా రెండు దశాబ్దాలు కొనసాగారు. ఇటీవల ఆయన రాజ్యసభ ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇక, బీహార్ తదుపరి ముఖ్యమంత్రిగా బీజేపీ నాయకుడు సామ్రాట్ చౌదరి బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ శాసనసభా పక్షం సామ్రాట్ చౌదరిని తమ పార్టీ నేతగా ఎన్నుకుంది. దీనితో ఆయన బుధవారం ప్రమాణం చేయనున్నారు. మధ్యప్రదేశ్ మాజీ సీఎం, కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ ఎన్నిక కోసం పరిశీలకుడిగా వచ్చారు. 1990లో ఆర్జేడీలో సామ్రాట్ చౌదరి తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1999లో వ్యవసాయ శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆ తర్వాత ఆయన జేడీయూలో చేరారు. అనంతరం ఆయన బీజేపీలో చేరగా, కొన్నాళ్లకే 2018లో బీహార్ బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 2023 మార్చిలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అయ్యారు. ఇప్పుడు బీహార్ ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన మొదటి బీజేపీ నేతగా ఆయన నిలవనున్నారు. ఆయన కుష్వాహా వర్గానికి చెందిన నాయకుడు. బీహార్‌లో యాదవుల తర్వాత కుష్వాహాల ప్రాబల్యం ఎక్కువగా ఉంటుంది. బీహార్‌లో ఇప్పటి వరకు ఈ వర్గానికి చెందిన నాయకుడికి ముఖ్యమంత్రి అయ్యే అవకాశం రాలేదు. సామ్రాట్ చౌదరిని పెద్ద నాయకుడిగా చేస్తానని బీహార్ ఎన్నికల ప్రచారంలో కేంద్రమంత్రి అమిత్ షా ప్రకటించారు. ఈ క్రమంలో తొలుత ఉపముఖ్యమంత్రిగా చేశారు. రేపు సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

# ఓవర్ లోడ్ అయితే ఫైన్!

**జాతీయ రహదారులపై తాజా నిబంధనలు**



న్యూఢిల్లీ: జాతీయ రహదారులపై పరిమితికి మించి బరువుతో (ఓవర్‌లోడ్) ప్రయాణించే వాహనాలపై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. రహదారుల భద్రతను పెంచడం, మౌలిక సదుపాయాలను కాపాడటమే లక్ష్యంగా కీలక సవరణలు చేసింది. ఈ మేరకు 'జాతీయ రహదారుల రుసుము (రేట్ల నిర్ధారణ, సేకరణ) నాలుగో సవరణ నిబంధనలు, 2026'ను కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ నోటిఫై చేసింది. ఈ కొత్త నిబంధనలు ఏప్రిల్ 15 నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి రానున్నాయి. వాహనదారులు నిర్దేశిత బరువు పరిమితులను కచ్చితంగా పాటించేలా చూడటం, తద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించడం ఈ సవరణల ప్రధాన ఉద్దేశం. సవరించిన నిబంధనల ప్రకారం, ఓవర్‌లోడ్ వాహనాలకు వాటి అదనపు బరువు శాతం ఆధారంగా రుసుము విధిస్తారు. వాహనం అనుమతించిన బరువు కన్నా 10 శాతం వరకు అదనపు బరువు ఉంటే ఎలాంటి ఓవర్‌లోడ్ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. అయితే, 10 శాతం నుంచి 40 శాతం వరకు అదనపు బరువుతో పట్టుబడితే, టోల్ ప్లాజా వద్ద వసూలు చేసే బేస్ టోల్ రేటుకు రెట్టింపు రుసుమును ఓవర్‌లోడ్ ఫీజుగా చెల్లించాలి. ఒకవేళ అదనపు బరువు 40 శాతానికి మించి ఉంటే, ఆ వాహనానికి బేస్ రేటుకు ఏకంగా నాలుగు రెట్లు అధికంగా ఫీజు వసూలు చేస్తారు. ఈ భారీ రుసుములు వాహనదారులను నిబంధనలు పాటించేలా ప్రోత్సహిస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. ఈ ఓవర్‌లోడ్ రుసుముల వసూలు ప్రక్రియను పూర్తిగా సాంకేతికతతో అనుసంధానించారు. టోల్ ప్లాజాల వద్ద ఏర్పాటు చేసిన సర్టిఫైడ్ బరువు తూనిక యంత్రాల ద్వారానే ఓవర్‌లోడ్‌ను నిర్ధారిస్తారు. ఒకవేళ ఏదైనా టోల్ ప్లాజా వద్ద ఈ తూనిక సౌకర్యం అందుబాటులో లేకపోతే, ఆ వాహనంపై ఎలాంటి ఓవర్‌లోడ్ ఫీజు విధించరు. ఓవర్‌లోడ్ రుసుమును కేవలం ఫాస్టాగ్ ద్వారా మాత్రమే వసూలు చేయాలని నిబంధనల్లో స్పష్టంగా పేర్కొన్నారు. నగదు చెల్లింపులకు ఆస్కారం లేదు. అంతేకాకుండా, నిబంధనలు ఉల్లంఘించిన వాహనాల వివరాలను జాతీయ వాహన రిజిస్టర్ (వాహన్) పోర్టల్‌లో నమోదు చేస్తారు. ఇది వాహనంపై శాశ్వత రికార్డుగా ఉంటుంది. ఈ నిబంధనలు ప్రారంభం కావడానికి ముందు అమలులో ఉన్న కొన్ని ప్రైవేట్ పెట్టుబడి ప్రాజెక్టులకు ఈ సవరణలు వర్తించవు. అయితే, ఆయా కన్సెషనర్లు అంగీకరిస్తే సవరించిన నిబంధనలను స్వీకరించవచ్చు. చెల్లుబాటు అయ్యే ఫాస్టాగ్ లేకుండా జాతీయ రహదారుల్లోకి ప్రవేశించే వాహనాలపై ఇప్పటికే ఉన్న నిబంధనల ప్రకారం చర్యలు వర్తిస్తాయి. ఈ కొత్త విధానం ద్వారా నిబంధనల అమలు మెరుగుపడటమే కాకుండా, ఓవర్‌లోడ్ వల్ల దెబ్బతింటున్న రహదారులను కాపాడవచ్చని, సరుకు రవాణాను మరింత సురక్షితంగా, సమర్థవంతంగా మార్చవచ్చని ప్రభుత్వం ఆశిస్తోంది.

# లీటర్ డీజిల్‌పై రూ.35, పెట్రోల్‌పై రూ.18 లాస్

**ఇరాన్-అమెరికా యుద్ధం ఎఫెక్ట్**




న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు భారీగా పెరిగాయి. అయితే మన వద్ద పెట్రోల్, డీజిల్ ధరలు యథాతథంగా కొనసాగుతుండటంతో చమురురంగ కంపెనీలు భారీ నష్టాలను చవిచూస్తున్నాయి. చమురు కంపెనీలకు లీటర్ పెట్రోల్‌పై రూ.18, లీటర్ డీజిల్‌పై రూ.35 చొప్పున నష్టం వస్తోంది. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం కారణంగా అంతర్జాతీయంగా బ్యారెల్ చమురు ధర 100 డాలర్లు దాటింది. ఇప్పుడు ఇరాన్, అమెరికా యుద్ధ ప్రభావంతో ఒక దశలో బ్యారెల్ చమురు 120 డాలర్లకు చేరుకుంది. చమురు ధరలు భారీగా పెరిగినప్పటికీ మన వద్ద ధరలు పెరగకపోవడంతో చమురురంగ కంపెనీలు నష్టాలను చూస్తున్నాయి. ఐవోసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ సంస్థలు రోజుకు రూ.2,400 కోట్ల మేర నష్టాలను భరించాల్సి వస్తోంది. అయితే కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవడం చమురు సంస్థలకు కొంత ఊరట దక్కుతోంది. పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు రూ.10 చొప్పున ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించింది. దీనితో చమురు రంగ కంపెనీల నష్టం రూ.1,600 కోట్లకు తగ్గింది. జనవరి, ఫిబ్రవరి నెలల్లో చమురు కంపెనీలకు లాభాలు వచ్చినప్పటికీ, ఇరాన్-అమెరికా యుద్ధం కారణంగా అవి తుడిచిపెట్టుకుపోయినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. జనవరి-మార్చి త్రైమాసికానికి గాను కంపెనీలు నష్టాలను ప్రకటించే అవకాశం ఉందని చెబుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధర 135-165 డాలర్ల మధ్య ఉంటే మనదేశంలోని ప్రస్తుత ధరలను బట్టి లీటర్ పెట్రోలుపై రూ.18, లీటర్ డీజిల్‌పై రూ.35 చొప్పున నష్టాలు వస్తాయని మాక్వరీ గ్రూప్ అంచనా వేసింది. క్రూడాయిల్ ధర 10 డాలర్లు పెరిగితే చమురు మార్కెటింగ్ కంపెనీలు లీటరుకు రూ.6 చొప్పున నష్టపోతాయని వెల్లడించింది. కాగా, ప్రస్తుతం వివిధ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. బెంగాల్, తమిళనాడు ఎన్నికల తర్వాత పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగే అవకాశం ఉంది.

# ప్రజల్లో అనవసర భయాలు

**స్టాలిన్ వార్నింగ్‌కు అన్నామలై కౌంటర్**



చెన్నై: నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కేంద్రాన్ని ఉద్దేశిస్తూ చేసిన 'ఫైనల్ వార్నింగ్' ప్రకటనపై తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు కె. అన్నామలై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రజల్లో అనవసర భయాందోళనలు సృష్టించేందుకే స్టాలిన్ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని, కేంద్రంపై ఆయన చేసిన హెచ్చరికలు ఏమాత్రం సరికాదని మంగళవారం ఘాటుగా స్పందించారు. ఈ విషయంలో ప్రధాని మోదీ ప్రభుత్వం అన్ని వర్గాలను కలుపుకొని ముందుకు వెళ్తుందని, స్టాలిన్ ఆందోళనలు నిరాధారమైనవని కొట్టిపారేశారు. ఏప్రిల్ 16 నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ రాజకీయ వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సమావేశాల్లో మహిళలకు పార్లమెంటులో మూడింట ఒక వంతు రిజర్వేషన్లు కల్పించే "నారీ శక్తి వందన్ అధినియమ్" సవరణలతో పాటు, ప్రతిపాదిత డీలిమిటేషన్ బిల్లుపై చర్చ జరగనుంది. ఈ క్రమంలోనే సీఎం స్టాలిన్ ఒక వీడియో సందేశం విడుదల చేశారు. పునర్విభజన ప్రక్రియ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. కేంద్రం మార్గదర్శకాలకు అనుగుణంగా జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసిన తమిళనాడు వంటి రాష్ట్రాలు ఇప్పుడు నష్టపోయే పరిస్థితి రాకూడదని స్పష్టం చేశారు. ఒకవేళ తమ ప్రయోజనాలకు భంగం వాటిల్లితే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23న అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న తరుణంలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించడంపై కూడా ఆయన అనుమానాలు వ్యక్తం చేశారు. స్టాలిన్ వ్యాఖ్యలపై అన్నామలై తీవ్రంగా స్పందించారు. "ముఖ్యమంత్రి ప్రజల మనసుల్లో విభేదాలు సృష్టించి, భయాన్ని నూరిపోయాలని చూడటం చాలా దురదృష్టకరం. తమిళనాడు మళ్లీ 1960ల నాటి పరిస్థితులకు వెళుతుందని, ప్రధానిని బెదిరించేలా ఆయన ఉపయోగించిన భాష ఆమోదయోగ్యం కాదు" అని అన్నామలై అన్నారు. ప్రధాని మోదీ అందరినీ ఏకతాటిపైకి తెచ్చేందుకు ఎంతో కృషి చేశారని తెలిపారు. డీలిమిటేషన్ పెంపు పూర్తిగా జనాభా ఆధారంగా ఉంటుందని కేంద్రం ఎక్కడా చెప్పలేదని అన్నామలై స్పష్టం చేశారు. "తమిళనాడు ముఖ్యమంత్రి సమస్య ఏంటి? మేం ఎక్కడా జనాభా ఆధారంగానే పెంపు ఉంటుందని చెప్పలేదు. అందరినీ కలుపుకొనిపోతామని చెప్పాం. ఏడాది క్రితం కోయంబత్తూరులో కేంద్ర హోంమంత్రి మాట్లాడుతూ.. పెంపు ప్రో-రాటా (అనుపాత) పద్ధతిలో ఉంటుందని, తద్వారా ఏ రాష్ట్రానికీ నష్టం జరగదని హామీ ఇచ్చారు. అయినప్పటికీ, సీఎం స్టాలిన్ ఇలాంటి వీడియో విడుదల చేయడం ఆయన రాజ్యాంగంపై చేసిన ప్రమాణానికి విరుద్ధం" అని అన్నామలై విమర్శించారు.

**ఏమిటీ 'ప్రో-రాటా' విధానం?**

**కేంద్రం ఏం చెబుతోందంటే...!**

సాధారణంగా నియోజకవర్గాల పునర్విభజన తాజా జనాభా లెక్కల ఆధారంగా జరగాలి. కానీ, 'ప్రో-రాటా' విధానంలో అలా కాకుండా, ప్రస్తుతం ఏ రాష్ట్రానికి ఎన్ని సీట్లు ఉన్నాయో అదే నిష్పత్తిలో కొత్త సీట్లను పెంచుతారు. ఉదాహరణకు, అన్ని రాష్ట్రాలకు ఏకరీతిగా 50 శాతం సీట్లు పెంచితే, 80 సీట్లున్న ఉత్తరప్రదేశ్‌కు 120, 39 సీట్లున్న తమిళనాడుకు దాదాపు 59 సీట్లు వస్తాయి. జనాభా నియంత్రణను సమర్థంగా అమలు చేసి నష్టపోతామని భావిస్తున్న దక్షిణాది రాష్ట్రాల ఆందోళనలను తగ్గించేందుకే కేంద్రం ఈ ఫార్ములాను పరిశీలిస్తున్నట్లు చెబుతోంది.



## ఇరాన్ ఓడరేవులన్నీ దిగ్బంధం

**ఆపరేషన్‌లో 10000 మంది అమెరికా సైనికులు**

**12కు పైగా యుద్ధ నౌకలు మోహరింపు**

టెహ్రాన్: అంతర్జాతీయ జలాల్లో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసేలా అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. ఇరాన్ ఓడరేవులను పూర్తిగా దిగ్బంధిస్తున్నట్లు ప్రకటించింది. అరేబియా గల్ఫ్, గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లోని అన్ని ఇరాన్ పోర్టుల నుంచి ఏ నౌక బయటకు వెళ్లకుండా, లోపలికి రాకుండా కఠినమైన ఆంక్షలు విధించింది. ఈ భారీ సైనిక ఆపరేషన్ కోసం 10,000 మందికి పైగా అమెరికా నావికులు, మెరైన్లు, వైమానిక దళ సిబ్బందిని రంగంలోకి దించింది. ఈ మిషన్ కోసం డజనుకు పైగా యుద్ధనౌకలు, వందకు పైగా యుద్ధ, నిఘా విమానాలను మోహరించింది. దిగ్బంధనం ప్రారంభమైన తొలి 24 గంటల్లోనే దీని ప్రభావం స్పష్టంగా కనిపించింది. ఇరాన్ ఓడరేవుల నుంచి బయటకు వెళ్లేందుకు ప్రయత్నించిన ఏ ఒక్క నౌక కూడా ఈ సైనిక వలయాన్ని దాటి ముందుకు వెళ్లలేకపోయింది. ఈ క్రమంలో, అమెరికా బలగాలు జారీ చేసిన ఆదేశాలను అనుసరించి ఆరు వాణిజ్య నౌకలు తమ ప్రయాణాన్ని రద్దు చేసుకుని తిరిగి ఇరాన్‌లోని గల్ఫ్ ఆఫ్ ఒమన్ పోర్టులోకి ప్రవేశించాయి. ఈ దిగ్బంధనాన్ని ఏ దేశ నౌకపైనా పక్షపాతం లేకుండా అమలు చేస్తున్నామని, ఇరాన్ పోర్టులకు వెళ్లే లేదా అక్కడి నుంచి బయలుదేరే ఏ నౌకనైనా నిలిపివేస్తామని అమెరికా స్పష్టం చేసింది. అయితే, ప్రపంచ వాణిజ్యానికి కీలకమైన హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణించే ఇతర నౌకల స్వేచ్ఛకు ఎలాంటి ఆటంకం ఉండదని హామీ ఇచ్చింది. కేవలం ఇరాన్ పోర్టులకు వెళ్లే లేదా వచ్చే నౌకలను మాత్రమే లక్ష్యంగా చేసుకున్నామని, మిగిలిన రవాణా యథావిధిగా కొనసాగుతుందని తెలిపింది. ఈ భారీ ఆపరేషన్‌లో భాగంగా ఒక ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్, యాంఫిబియస్ అసాల్ట్ షిప్, గైడెడ్-మిసైల్ డిస్ట్రాయర్లు, లిట్టోరల్ కంబాట్ షిప్ వంటి అత్యాధునిక యుద్ధనౌకలు పాల్గొంటున్నాయి. వీటితో పాటు ఫైటర్ జెట్లు, డ్రోన్లు, ఇంధనం నింపే విమానాలు, నిఘా విమానాలు నిరంతరం గగనతలం నుంచి పహారా కాస్తున్నాయి. ఈ మేరకు అమెరికా సెంట్రల్ మిలిటరీ కమాండ్ ఓ ప్రకటనలో వెల్లడించింది.

## మరో రెండ్రోజుల్లో రెండో విడత

**ఇరాన్‌తో చర్చలు జరగొచ్చన్న ట్రంప్**

**చర్చలపై ఇరాన్ నుంచి స్పష్టత కరవు**



వాషింగ్టన్: అమెరికా, ఇరాన్ మధ్య మరోసారి చర్చలు ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాబోయే రెండ్రోజుల్లోనే ఈ పరిణామం చోటుచేసుకోవచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ చర్చలు పాకిస్థాన్‌లో జరిగేందుకే తాము మొగ్గు చూపుతున్నట్లు ఆయన తెలిపారు. న్యూయార్క్ పోస్ట్‌కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ విషయం వెల్లడించారు. "రాబోయే రెండ్రోజుల్లో ఏదైనా జరగవచ్చు. మేము అక్కడికి (పాకిస్థాన్‌కు) వెళ్లడానికే మొగ్గు చూపుతున్నాం" అని ట్రంప్ పేర్కొన్నారు. ఈ చర్చల విషయంలో పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ అద్భుతంగా పనిచేస్తున్నారని, ఆయన అద్భుతమైన వ్యక్తి అని ప్రశంసించారు. అందుకే మళ్లీ అక్కడికే వెళ్లే అవకాశం ఉందని అన్నారు. ఇటీవల వారాంతంలో పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్ వేదికగా అమెరికా-ఇరాన్ దేశాల మధ్య చర్చలు జరిగాయి. ఈ సమావేశంలో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బఘేర్ ఘలీబాఫ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. అయితే, ఆ చర్చల్లో ఎలాంటి ఒప్పందం కుదరలేదు. మరోవైపు, టెహ్రాన్, పాకిస్థాన్ మధ్య సందేశాలు మార్పిడి జరిగినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా తెలిపింది. కానీ, అమెరికాతో మలివిడత చర్చలు జరపడంపై తమ వద్ద ఎలాంటి సమాచారం లేదని స్పష్టం చేసింది. దీంతో చర్చల పునరుద్ధరణపై ఉత్కంఠ కొనసాగుతోంది.

## ఆర్థిక సమస్యలు..

## బిడ్డను చంపి తల్లి సూసైడ్

**బెంగళూరు వైట్‌ఫీల్డ్ లో ఘోరం**

బెంగళూరు: బెంగళూరు నగరంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కన్న కూతురిని ఓ తల్లే కిరాతకంగా హతమార్చి, ఆ తర్వాత తానూ ఆత్మహత్యకు పాల్పడింది. వైట్‌ఫీల్డ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇమ్మడిహళ్లిలో మంగళవారం ఉదయం ఈ హృదయ విదారక ఘటన వెలుగులోకి వచ్చింది. మృతులను సువర్ణ (40), ఆమె కుమార్తె కారుణ్య (14)గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, సువర్ణ భర్త చంద్రశేఖర్ ఉదయం యథావిధిగా విధులకు వెళ్లారు. ఆ తర్వాత భార్యకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందన రాలేదు. దీంతో అనుమానం వచ్చి, దగ్గర్లో ఉన్న తన సోదరుడిని ఇంటికి వెళ్లి చూడమని కోరారు. ఉదయం 11 గంటల సమయంలో అతడు ఇంటికి వెళ్లి చూడగా, గదిలో కారుణ్య విగతజీవిగా పడి ఉండగా, సువర్ణ ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించింది. సమాచారం అందుకున్న వైట్‌ఫీల్డ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కుమార్తెను ఊపిరాడకుండా చేసి చంపిన తర్వాత, సువర్ణ ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. అయితే, ఆర్థిక సమస్యల కారణంగా సువర్ణ తీవ్రమైన మనోవేదనకు గురై ఈ దారుణానికి పాల్పడి ఉండవచ్చని ఆమె సోదరి ఉష అనుమానం వ్యక్తం చేశారు. ఖర్చులు పెరిగిపోతున్నాయని, కుటుంబాన్ని నడపడం కష్టంగా ఉందని సువర్ణ తనతో చెప్పినట్లు ఆమె తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు రెండు కేసులు నమోదు చేశారు. తన కుమార్తెను భార్యే హత్య చేసిందని భర్త చంద్రశేఖర్ ఫిర్యాదు చేయగా, సువర్ణ మృతిపై ఆమె సోదరుడు మంజునాథ్ అనుమానాలు వ్యక్తం చేస్తూ మరో ఫిర్యాదు చేశారు. ఈ రెండు కోణాల్లో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## అమెరికాను తప్పించుకొని.. హర్మూజ్ దాటి..!

టెహ్రాన్: అమెరికా దిగ్బంధనాన్ని తప్పించుకుని చిన్న దేశాలకు చెందిన రెండు నౌకలు హర్మూజ్ జలసంధిని దాటాయి. ఇరాన్‌కు వచ్చే, ఆ దేశాన్ని వీడే నౌకలను అడ్డుకోవడానికి ఆ దేశ పోర్టులు, తీరప్రాంతాల చుట్టూ 15కు పైగా యుద్ధ నౌకలను అమెరికా రంగంలోకి దింపింది. అమెరికా పెద్ద ఎత్తున మోహరించినప్పటికీ, లైబీరియా జెండా కలిగిన 'క్రిస్టియానా' అనే బల్క్ క్యారియర్ ఇరాన్ ఓడరేవులో ఆదివారం మొక్కజొన్న సరుకును దించినట్లు కెప్లర్ నౌక రవాణా ట్రాకింగ్ డేటా వెల్లడించింది. అమెరికా దిగ్బంధనం అమల్లోకి వచ్చిన రెండు గంటల తర్వాత ఈ నౌక హర్మూజ్ గుండా ప్రయాణించి లారాక్ ద్వీపాన్ని దాటింది. కొమొరోస్ జెండా కలిగిన రెండో నౌక ఎల్విస్ కూడా లారాక్ ద్వీపం నుంచి బయలుదేరి హర్మూజ్‌ను దాటింది.

ఒయ్యారి చిత్రం


ఈషాన్యా మహేశ్వరి





## ఖుషీ కపూర్ తల్లిని మరిపిస్తుందా?

శ్రీదేవి వారసత్వం ఇప్పుడు ఆమె కూతుర్లైన జాన్వీ కపూర్, ఖుషి కపూర్ ముందున్న అతిపెద్ద సవాల్‌గా మారింది. జాన్వీ ఇప్పటికే కొన్ని సినిమాల ద్వారా తన యాక్టింగ్ ను నిరూపించుకునే ప్రయత్నం చేస్తోంది. కానీ ఇంకా ఆమెను టాప్ లీగ్‌లో నిలబెట్టే ఒక సూపర్ హిట్ కోసం ఎదురుచూస్తోంది. మరోవైపు ఖుషీ కపూర్ కెరీర్ ఇంకా ప్రారంభ దశలోనే ఉంది. ది ఆర్చీస్, లవ్‌యాపా, నాదనియాన్ లాంటి ప్రాజెక్టులు ఆశించిన ఫలితాలను ఇవ్వకపోవడం ఆమెకు ఒక మైనస్‌గా మారింది. ఈ సినిమాలు బాక్సాఫీస్ వద్ద, ప్రేక్షకుల మనసుల్లోనూ పెద్దగా ముద్ర వేయలేకపోయాయి. ఇది కేవలం మరో సినిమా మాత్రమే కాదు, ఇదొక ఎమోషనల్ జర్నీ. ఎందుకంటే మామ్ సినిమా శ్రీదేవి కెరీర్‌లో అత్యంత గుర్తింపు పొందిన సినిమాల్లో ఒకటి.

## ధురంధర్ ప్రభంజనం.. 3000 కోట్లు!

భారతీయ చలనచిత్ర పరిశ్రమలో ఇప్పటివరకు ఏ సినిమా ఫ్రాంచైజీకి సాధ్యం కాని అరుదైన మైలురాయిని 'ధురంధర్' సిరీస్ అధిగమించింది. రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో, దర్శకుడు ఆదిత్య ధర్ రూపొందించిన ఈ స్పై థ్రిల్లర్ సిరీస్ రెండు భాగాలు కలిపి ప్రపంచవ్యాప్తంగా రూ.3000 కోట్ల వసూళ్లను సాధించి చరిత్ర సృష్టించింది. తాజా నివేదికల ప్రకారం, ఈ ఫ్రాంచైజీలోని రెండు చిత్రాల ఉమ్మడి వసూళ్లు రూ.3,019 కోట్లకు చేరాయి. భారతీయ సినిమా చరిత్రలో ఒకే ఫ్రాంచైజీకి చెందిన సినిమాలు ఈ స్థాయిలో వసూళ్లు సాధించడం ఇదే మొదటిసారి. ధురందర్ (మొదటి భాగం) 2025 డిసెంబరులో విడుదలైన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ. 1,307 కోట్లు వసూలు చేసింది. ధురందర్ ది రివెంజ్ (రెండవ భాగం) 2026 మార్చిలో విడుదలైన ఈ చిత్రం కేవలం 26 రోజుల్లోనే రూ. 1,712 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. ఈ భారీ వసూళ్లతో 'ధురందర్' ఫ్రాంచైజీ.. గతంలో రికార్డులు సృష్టించిన 'బాహుబలి' (రెండు భాగాలు కలిపి రూ. 2,438 కోట్లు), 'పుష్ప' (రెండు భాగాలు కలిపి రూ. 2,092 కోట్లు) వంటి చిత్రాల రికార్డులను అధిగమించింది. ముఖ్యంగా రెండవ భాగం 'ధురందర్: ది రివెంజ్' భారతీయ బాక్సాఫీస్ వద్ద రూ. 1,000 కోట్ల నెట్ వసూళ్లను సాధించిన మొదటి హిందీ చిత్రంగా నిలిచింది.



## నివేదా పేతురాజ్ రీఎంట్రీ

తెలుగు, తమిళ చిత్ర పరిశ్రమల్లో తనదైన నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నివేదా పేతురాజ్ గత కొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉన్న విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు ఆమె మళ్లీ వార్తల్లో నిలవడం ఆసక్తికరంగా మారింది. ఇటీవల ఆమె వ్యక్తిగత జీవితం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. దుబాయ్‌కు చెందిన వ్యాపారవేత్త రాజ్‌హిత్ ఇబ్రాన్‌తో ఆమె నిశ్చితార్థం జరిగిందని గతంలో వార్తలు వచ్చాయి. ఆ తర్వాత ఇద్దరూ కలిసి ఉన్న ఫోటోలను సోషల్ మీడియాలో పంచుకోవడంతో ఈ వార్తలకు మరింత బలం చేకూరింది. అయితే అనూహ్యంగా నివేదా తన సోషల్ మీడియా ఖాతా నుంచి ఆ ఫోటోలన్నింటినీ తొలగించడమే కాకుండా, అతడిని అన్‌ఫాలో చేయడం చర్చనీయాంశమైంది. ఇదే సమయంలో రాజ్‌హిత్ మరో యువతితో నిశ్చితార్థం చేసుకున్నారనే వార్తలు వైరల్ కావడంతో, నివేదా పెళ్లి రద్దయ్యిందనే ప్రచారం బలపడింది. ఈ అంశంపై ఆమె అధికారికంగా స్పందించకపోయినా, నెటిజన్లు మాత్రం బ్రేకప్ జరిగిందని భావిస్తున్నారు. ఈ పరిణామాల మధ్య నివేదా మళ్లీ తన సినీ కెరీర్‌పై దృష్టి సారించినట్లు తెలుస్తోంది.




## యాక్షన్ డ్రామాతో ..

యంగ్ హీరోయిన్ రాశీ ఖన్నా తన కెరీర్‌లో ఒక గట్టి హిట్ కోసం ఎదురుచూస్తోంది. వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నప్పటికీ, బాక్సాఫీస్ వద్ద ఆమెకు అదృష్టం అంతగా కలిసి రావడం లేదు. చివరగా హిందీలో 'ది సబర్మతి రిపోర్ట్' చిత్రంతో హిట్ కొట్టి ఈ భామకు.. తెలుగులో భారీ అంచనాల మధ్య వచ్చిన తెలుసు కదా, ఉస్తాద్ భగత్ సింగ్ వంటి చిత్రాలు ప్రేక్షకులను పూర్తిస్థాయిలో మెప్పించలేకపోవడంతో, ఇప్పుడు ఆమె తన ఆశలన్నీ ఓటీటీపైనే పెట్టుకుంది. రాశీ ఖన్నా తన తదుపరి ప్రాజెక్ట్‌ను ఒక విభిన్నమైన మ్యూజికల్ యాక్షన్ డ్రామాగా ఎంచుకుంది. 'లుఖ్ఖే' అనే టైటిల్‌తో రాబోతున్న ఈ క్రేజీ సిరీస్‌లో పాపులర్ ర్యాపర్ కింగ్ హీరోగా పరిచయం అవుతున్నారు. హిమాంక్ గౌర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సిరీస్‌లో పాలక్ తివారి, శివాంకిత్, లక్ష్య వీర్ శరణ్ ముఖ్య పాత్రలో కనిపించబోతున్నారు. పంజాబ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ కథలో రాశీ ఖన్నా లుక్ పర్ఫార్మెన్స్ చాలా కొత్తగా ఉండబోతున్నాయని సమాచారం.

## ధనుష్ 56 చిత్రంలో సారా అర్జున్!



విభిన్న కథలతో కోలీవుడ్‌తో పాటు టాలీవుడ్‌లో కూడా తనకంటూ స్పెషల్ ఇమేజ్ క్రియేట్ చేసుకుని ప్రస్తుతం స్టార్ హీరోగా దూసుకుపోతున్నాడు ధనుష్. ఆయన గ్యాప్ ఇవ్వకుండా బ్యాక్ టు బ్యాక్ ప్రాజెక్టులు అనౌన్స్ చేస్తూ బాక్సాఫీస్ వద్ద సంచలనాలు సృష్టిస్తున్నాడు. అలాగే ప్రస్తుతం ఈ హీరో తన 56వ చిత్రంపై కూడా ఫోకస్ పెట్టినట్లు టాక్. తమిళ దర్శకుడు తమిళరసన్ పచ్చముత్తు ఈ మూవీకి దర్శకత్వం వహిస్తున్నాడని తెలుస్తుండగా.. ఇందులో ఫీ మేల్ లీడ్ కోసం రుక్మిణి వసంత్‌ను ఓకే చేసినట్లు టాక్ వచ్చిన విషయం తెలిసిందే. 'కాంతార', 'ఏస్', 'మదరాసి' వంటి చిత్రాలతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ రుక్మిణి వసంత్ ప్రస్తుతం చేతులో వరుస ప్రాజెక్టులు పెట్టుకుని బిజీ అయిపోయింది.



## సౌత్ ఇండస్ట్రీపై ఆలియా మోజు

బాలీవుడ్ స్టార్ ఆలియా భట్ మరోసారి సౌత్ ఇండస్ట్రీ వైపు అడుగులు వేయబోతున్నారన్న వార్తలు ప్రస్తుతం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. త్వరలో ప్రారంభం కానున్న ఓ భారీ పాన్ ఇండియా తెలుగు సినిమాలో కీలక పాత్ర కోసం ఆలియా పేరును పరిశీలిస్తున్నారని ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది. ఈ వార్త నిజమైతే, ఇది కేవలం ఒక కాస్టింగ్ అప్డేట్ మాత్రమే కాకుండా, బాలీవుడ్- టాలీవుడ్ మధ్య మరో పెద్ద క్రాస్ ఓవర్ క్షణంగా నిలిచే అవకాశముంది. ఇప్పటికే ఆర్ఆర్ఆర్ ద్వారా ఆలియా తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. ఆ సినిమాలో ఆమె పాత్ర చిన్నదైనా, గ్లోబల్ స్థాయిలో భారీ విజయం సాధించిన ఆ ప్రాజెక్ట్‌లో భాగమవ్వడం ద్వారా ఆమెకు సౌత్ మార్కెట్‌లో ప్రత్యేక గుర్తింపు లభించింది. ముఖ్యంగా డైరెక్టర్ రాజమౌళి తెరకెక్కించిన ఆ సినిమాతో ఆలియా పేరు తెలుగు ప్రేక్షకుల్లో కూడా విస్తృతంగా వినిపించింది. ఆలియాకు కూడా తెలుగు ఇండస్ట్రీపై ప్రత్యేకమైన అభిమానం ఉందని ఆమె పలుమార్లు వెల్లడించారు. తన సినిమాలు తెలుగులో విడుదలైనప్పుడు ప్రమోషన్స్‌లో చురుకుగా పాల్గొనడం, తెలుగు ప్రేక్షకులతో నేరుగా మాట్లాడటానికి ప్రయత్నించడం ఆమెను తెలుగు ఆడియన్స్ కు మరింత దగ్గర చేశాయి. అంతేకాదు, కొన్నిసార్లు తెలుగు మాటలు మాట్లాడటం, తెలుగు పాటలు పాడటానికి ప్రయత్నించడం ద్వారా కూడా అభిమానులను ఆకట్టుకుంది. తెలుగు సినిమాలు కూడా చూస్తుంటానని ఆమె గతంలో చెప్పడం, ఈ అనుబంధాన్ని మరింత బలపరిచింది. ఈ నేపథ్యంలో తాజా పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లో ఆమె పేరును పరిశీలించడం, నిర్మాతలు దేశవ్యాప్తంగా ఉన్న ఆడియన్స్ ను ఆకర్షించే ప్రయత్నంగా చూడవచ్చు. ఇటీవలి కాలంలో పాన్ ఇండియా సినిమాలు భారీ స్థాయిలో విజయాలు సాధిస్తుండటంతో, స్టార్ కాస్టింగ్‌కు మరింత ప్రాధాన్యం పెరిగింది. ఈ క్రమంలో ఆలియా వంటి నేషనల్ లెవెల్ స్టార్ చేరితే, ఆ సినిమాకు మార్కెట్ రీచ్ గణనీయంగా పెరిగే అవకాశం ఉంది.





# మలుపు తిప్పిన నూర్

## చెన్నైలో సీఎస్కే విజయం.. చిత్తుగా ఓడిన కేకేఆర్

**ఐపీఎల్ 2026 సీజన్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్) పరాజయాల పరంపర కొనసాగుతోంది. చెన్నై సూపర్ కింగ్స్‌తో చెన్నై వేదికగా మంగళవారం జరిగిన మ్యాచ్‌లోనూ కేకేఆర్ 32 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. చెత్త బ్యాటింగ్ కేకేఆర్ విజయవకాశాలను దెబ్బతీసింది. మరోవైపు సీఎస్‌కే సమష్టి ప్రదర్శనతో రెండో విజయాన్ని ఖాతాలో వేసుకుంది.**

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన చెన్నై సూపర్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 192 పరుగులు చేసింది. సంజూ శాంసన్(32 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లతో 48), డెవాల్డ్ బ్రెవిస్(29 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 41), ఆయుష్ మాత్రే(17 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 38) టాప్ స్కోరర్లుగా నిలిచారు.

కేకేఆర్ బౌలర్లలో కార్తీక్ త్యాగి(2/35) రెండు వికెట్లు తీయగా.. అనుకుల్ రాయ్, సునీల్ నరైన్, వైభవ్ అరోరా తలో వికెట్ తీసారు. అనంతరం కేకేఆర్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 160 పరుగులే చేసి ఓటమిపాలైంది. రోవ్‌మన్ పోవెల్(22 బంతుల్లో ఫోర్, 2 సిక్స్‌లతో 31 నాటౌట్), రమణ్‌దీప్ సింగ్(23 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 35) పోరాడినా ఫలితం లేకపోయింది. అంజింక్యా రహానే(28), సునీల్ నరైన్(24), అంగ్‌క్రిష్ రఘువంశీ(27)తో పాటు ఇతర బ్యాటర్లు విఫలమయ్యారు. చెన్నై సూపర్ కింగ్స్ బౌలర్లలో నూర్ అహ్మద్(3/21) మూడు వికెట్లు తీయగా.. అన్షుల్ కంబోజ(2/32) రెండు వికెట్లు పడగొట్టాడు. ఖలీల్ అహ్మద్, అకీల్ హోస్సెన్ తలో వికెట్ తీసారు. ఇప్పటి వరకు ఐదు మ్యాచ్‌లు ఆడిన కేకేఆర్.. ఒక్క మ్యాచ్ కూడా గెలవలేదు. పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్ వర్షం కారణంగా రద్దవ్వడంతో కేకేఆర్ పాయింట్ల ఖాతా తెరిచింది.



## మలుపు తిప్పిన నూర్ అహ్మద్..

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన చెన్నై సూపర్ కింగ్స్ 192 పరుగులు చేయడంతో కేకేఆర్ విజయం లాంఛనమే అని అంతా అనుకున్నారు. సెకండ్ ఇన్నింగ్స్ టైమ్‌లో డ్యూ కూడా రావడంతో ఈజీగా లక్ష్యాన్ని ఛేదిస్తుందని అనుకున్నారు. కానీ కేకేఆర్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. డేంజరస్ ఫిన్ అలెన్(1) మరోసారి తీవ్రంగా నిరాశపర్చగా.. స్పిన్నర్ నూర్ అహ్మద్ కేకేఆర్ పతనాన్ని శాసించాడు. అంజిక్యా రహానే(28)తో పాటు రింకూ సింగ్(6), కామెరూన్ గ్రీన్(0)ను పెవిలియన్ చేర్చి మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. ఆ తర్వాత వచ్చిన రోవ్‌మన్ పోవెల్, రమణ్‌దీప్ సింగ్ పోరాడినా ఫలితం లేకపోయింది. సెకండ్ ఇన్నింగ్స్ సమయంలో పిచ్ కూడా స్లోగా మారినట్లు అనిపించింది. కేకేఆర్ కెప్టెన్ అజింక్యా రహానే టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకోవడం కూడా దెబ్బతీసింది.

## బ్యాటింగ్ వల్లే ఓడిపోయాం: రహానే

చెత్త బ్యాటింగే తమ ఓటమిని శాసించిందని కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్) కెప్టెన్ అజింక్యా రహానే అన్నాడు. తమ ఓటమికి బౌలింగ్ ఏ మాత్రం కారణం కాదని స్పష్టం చేశాడు. 'మా బ్యాటింగ్‌లో ఏ మాత్రం ఊపు కనిపించలేదు. ఇది వాస్తవం. బౌలింగ్‌లో మాత్రం మేం బాగా పుంజుకున్నాం. ఈ వికెట్‌పై 190 పరుగులు ఛేదించడం అంత కష్టం కాదు. ముఖ్యంగా పవర్ ప్లేలోనే 70 పరుగులు చేసిన సీఎస్‌కేను 190 పరుగులకే పరిమితం చేయడం మా బౌలింగ్ యూనిట్ అద్భుత ప్రదర్శనతోనే సాధ్యమైంది. మా బ్యాటింగ్‌లో మేం పవర్ ప్లేలో కనీసం 40 పరుగులు చేయలేకపోయాం. అక్కడే మ్యాచ్ మలుపు తిరిగింది. మిడిల్ ఓవర్లలో స్పిన్నర్లను ఎదుర్కోవడం సవాల్‌గా మారింది. వికెట్ బ్యాటింగ్‌కు అనుకూలంగానే ఉంది. ఎవరో ఒకరు ఆఖరి వరకు క్రీజులో ఉండి మ్యాచ్ ముగించాల్సింది. ప్రస్తుతం మేం కఠినమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నాం. మేం వరుసగా మ్యాచ్‌లు ఓడిపోతున్నాం. ఇది బాధకరమైన విషయం. కానీ ఒక జట్టుగా ఈ పరిస్థితుల్లో మేం సానుకూలంగా ఉండటం, ఆత్మవిశ్వాసంతో ఆడటం, ఆటపై ఫోకస్ పెట్టడం ముఖ్యం. మా కాంబినేషన్ గురించి పునరాలోచన చేయాలి. అవసరమైన మార్పులను చేయాలి. ఫలితాలు అనుకూలంగా ఉన్నప్పుడు ఆటగాళ్లను ఎవరూ ఏమనరు. కానీ ఫలితాలు ప్రతికూలంగా ఉన్నప్పుడు జట్టు కాంబినేషన్ గురించి ఆలోచన చేయక తప్పదు.అయితే సానుకూల దృక్పథంతో ఉండటం అన్నిటి కన్నా ముఖ్యం. కార్తీక్ త్యాగి అద్భుతంగా బౌలింగ్ చేస్తున్నాడు. నెట్స్‌లో చాలా కష్టపడుతున్నాడు. అతను గొప్ప ప్రతిభావంతుడు. అతను బౌలింగ్ చేస్తున్న విధానం పట్ల సంతోషంగా ఉన్నాను. మ్యాచ్ మ్యాచ్‌కూ అతను తన నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటున్నాడు. ఇరు జట్లలో స్పిన్నర్లు మెరుగైన ప్రదర్శన చేశారు. బౌలర్లు మరీ ఫుల్ లెంగ్త్‌లో వేస్తే తప్ప, బ్యాటర్లు భారీ సిక్సర్లు కొట్టడం ఈ వికెట్‌పై అంత సులువు కాదు. బ్యాటర్లకు అది అంత తేలికైన ఆప్షన్ కాదు. ఏది ఏమైనా మేం ఆత్మవిశ్వాసంతో సానుకూలంగా ముందుకు సాగాల్సి ఉంది.'అని రహానే అభిప్రాయపడ్డాడు.



# సూర్య కెప్టెన్సీపై వేటు!

టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ భవితవ్యంపై భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో టీమిండియాను విజేతగా నిలెబెట్టిన ఈ ముంబై ఆటగాడిని కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పించాలనే యోచనలో సెలెక్టర్లు ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. భారత్ వేదికగా జరిగిన ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో టీమిండియాను సూర్య విజేతగా నిలబెట్టాడు. తద్వారా మూడు ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లు గెలిచిన జట్టుగా.. సొంతగడ్డపై టైటిల్ నిలబెట్టుకున్న టీమ్‌గా టీమిండియా చరిత్ర సృష్టించింది. వాస్తవానికి ఈ మెగా టోర్నీ ప్రారంభానికి ముందే సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీపై పుకార్లు వచ్చాయి. కెప్టెన్‌గా టీమిండియాకు అద్భుతమైన విజయాలు అందించినప్పటికీ.. బ్యాటర్‌గా అతను దారుణంగా విఫలమయ్యాడు. మెగా టోర్నీలోనూ అతని బ్యాట్ నుంచి ఆశించిన పరుగులు రాలేదు. మెగా టోర్నీ విజయానంతరం సూర్య రిటైర్ అవుతున్నట్లు కూడా ప్రచారం జరిగింది. కానీ ఈ వార్తలను కొట్టిపారేసిన సూర్య.. 2028 ఒలింపిక్స్ ఆడటమే తన లక్ష్యమని స్పష్టం చేశాడు. అయితే టీమిండియా మేనేజ్‌మెంట్ మాత్రం భిన్నంగా ఆలోచిస్తుంది. ఇంగ్లండ్ పర్యటన తర్వాత సూర్యను కెప్టెన్‌గా తప్పించే అవకాశాలు ఉన్నట్లు బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి. ఒకప్పుడు వరల్డ్ నెంబర్ వన్ టీ20 బ్యాటర్‌గా కొనసాగిన సూర్యకుమార్ యాదవ్.. కెప్టెన్సీ చేపట్టిన తర్వాత పరుగులు చేయడానికి ఇబ్బంది పడుతున్నాడు. గతేడాది అతని స్ట్రైక్‌రేట్ 120లోపే పడిపోగా.. ఒక్క హాఫ్ సెంచరీ కూడా చేయలేకపోయాడు. ఈ ఏడాది నాలుగు హాఫ్ సెంచరీలు బాదిన సూర్య.. పసికూన అమెరికాపై మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శన కనబర్చాడు. ఆ తర్వాత సౌతాఫ్రికాపై 18, వెస్టిండీస్‌పై 18, సెమీఫైనల్లో ఇంగ్లండ్‌పై 11, ఫైనల్లో న్యూజిలాండ్‌పై 0 పరుగులే చేసి తీవ్రంగా నిరాశపర్చాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లోనూ సూర్య ఇప్పటి వరకు చెప్పుకోదగ్గ ప్రదర్శన చేయలేదు. ఐపీఎల్ ముగిసిన వెంటనే టీమిండియా ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనుంది. ఇంగ్లండ్‌లో సూర్య బ్యాటింగ్ ప్రదర్శన ఆధారంగా అతని కెప్టెన్సీ భవిత్యం ఆధారపడి ఉందని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి. 'ఇంగ్లండ్ పర్యటనలో సూర్యనే కెప్టెన్. అయితే బ్యాటర్‌గా అతను నిలకడగా రాణించాల్సి ఉంది. ఈ విషయంలో అతను సెలెక్టర్లకు నమ్మకం కలిగించాలి. అయితే 2028 నాటికి అతను జట్టుతో కొనసాగాలంటే కచ్చితంగా మెరుగైన ప్రదర్శనలు ఇవ్వాల్సిందే'అని బీసీసీఐ అధికారి ఒకరు మీడియాకు తెలిపారు. మరోవైపు, టీ20 ఫార్మాట్‌లో ఆటగాళ్ల మధ్య తీవ్ర పోటీ నెలకొంది.




## సన్‌రైజర్స్‌లోకి మధుషంక ఎంట్రీ!

ఐపీఎల్ 2026 సీజన్ నేపథ్యంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులో కీలక మార్పు చోటు చేసుకుంది. జట్టులోని ఓవర్‌సీస్ పేసర్ బ్రైడన్ కార్స్ గాయంతో సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. దాంతో అతని స్థానాన్ని శ్రీలంక పేసర్ దిల్షాన్ మధుషంకతో భర్తీ చేశారు. ఈ విషయాన్ని సన్‌రైజర్స్ హైదరాబాద్ మంగళవారం సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. ప్యాట్ కమిన్స్ గైర్హాజరీలో జట్టుకు ఉపయోగపడుతాడని భావించిన బ్రైడన్ కార్స్ గాయంతో జట్టుకు దూరమయ్యాడు. అతను ఇప్పటి వరకు ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. దిల్షాన్ మదుషంకను రూ.75 లక్షల కనీస ధరకు సన్‌రైజర్స్ హైదరాబాద్ తీసుకుంది.



## ఒక్క ఓవర్‌తో లక్షల ఫాలోవర్లు

**రాత్రికి రాత్రే ప్రఫుల్ హింగేకు ఫుల్ క్రేజ్**

ఐపీఎల్ ఓ ఆటగాడి జీవితాన్ని ఎలా మారుస్తుందో చెప్పడానికి ప్రఫుల్ హింగే ఓ నిలువెత్తు నిదర్శనం. సోమవారం రాత్రి వరకు ప్రఫుల్ హింగే ఎవరో కూడా చాలా మందికి తెలియదు. విదర్భకు చెందిన ఈ 24 ఏళ్ల పేసర్‌ను సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు తన బేస్ ధర రూ.30 లక్షలకు కొనుగోలు చేసింది. అప్పటి నుంచి బెంచ్‌కే పరిమితమైన ప్రఫుల్ హింగేకు.. రాజస్థాన్ రాయల్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో అరంగేట్రం చేసే అవకాశం దక్కింది. తన అద్భుత ప్రదర్శనతో కేవలం 6 బంతుల్లోనే ప్రపంచం మొత్తం తన పేరును వెతికేలా చేశాడు. ప్రఫుల్ హింగే అద్భుత ప్రదర్శన అతని సోషల్ మీడియా ఖాతాపై పెను ప్రభావాన్ని చూపింది. బంతిని అందుకునే ముందు అతని ఇన్‌స్టాగ్రామ్ ఫాలోవర్ల సంఖ్య కేవలం 3,000 మాత్రమే. కానీ మ్యాచ్ ముగిసిన కొద్దిసేపటికే అది ఏకంగా 1,61,000కి చేరుకుంది. అంటే దాదాపు 5000 శాతానికి పైగా పెరుగుదల కనిపించింది. అభిమానులు అతని ప్రొఫైల్‌ను లైకులు, కామెంట్లతో ముంచెత్తుతున్నారు. ఓ సాధారణ ఆటగాడు ఒకే ఓవర్‌తో గ్లోబల్ సెన్సేషన్‌గా మారడం ఐపీఎల్ పవర్‌ను మరోసారి నిరూపించింది.



## వైభవ్ నువ్వు జాగ్రత్త

భారత క్రికెట్‌లో అతి చిన్న వయసులోనే సంచలనాలు సృష్టిస్తున్న 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీకి ఐపీఎల్ 2026లో ఎదురుదెబ్బ తగిలింది. ప్రస్తుత సీజన్లో పరుగుల వరద పారిస్తూ ఆరెంజ్ క్యాప్ రేసులో ఉన్న వైభవ్ సూర్యవంశీ.. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో ఎదుర్కొన్న మొదటి బంతికే డకౌట్‌గా వెనుదిరిగాడు. అరంగేట్ర పేసర్ ప్రఫుల్ హింగే వేసిన బంతికి వైభవ్ సూర్యవంశీ ఔట్ కావడం అందరినీ ఆశ్చర్యపరిచింది. అయితే ఈ ఒక్క వైఫల్యం తర్వాత వైభవ్ చుట్టూ ఉన్న పరిస్థితులపై న్యూజిలాండ్ మాజీ దిగ్గజం సైమన్ డల్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ఓ చర్చా కార్యక్రమంలో సైమన్ డల్ మాట్లాడుతూ.. వైభవ్ సూర్యవంశీ వంటి యువ ప్లేయర్ల చుట్టూ తిరిగే మేనేజ్మెంట్ కంపెనీల గురించి ఆందోళన వ్యక్తం చేశాడు. "వైభవ్ సూర్యవంశీ ఇప్పటికే ఓ సూపర్ స్టార్ అయిపోయాడు. భారత క్రికెట్‌లో వైభవ్ తదుపరి పెద్ద స్టార్ అవుతాడనడంలో సందేహం లేదు. కానీ 15 ఏళ్ల వయసులో వచ్చే విపరీతమైన డబ్బు, కీర్తి ఎవరినైనా తప్పుదోవ పట్టించగలవు. ముఖ్యంగా అతని చుట్టూ ఉండే వ్యక్తుల విషయంలో వైభవ్ చాలా అప్రమత్తంగా ఉండాలి" అని మాజీ దిగ్గజం సైమన్ డల్ హెచ్చరించాడు. చాలా మేనేజ్మెంట్ కంపెనీలు ఆటగాళ్ల కెరీర్ కంటే తమ లాభాలకే ప్రాధాన్యత ఇస్తాయని సైమన్ డల్ విమర్శించాడు. "ఈ యువ ఆటగాడి ద్వారా ఎంత సంపాదించవచ్చు? మా కంపెనీకి ఎంత లాభం వస్తుంది? అనేదే వారి ఆలోచన. ప్రపంచవ్యాప్తంగా మేనేజ్మెంట్ కంపెనీలతో ఉన్న అతిపెద్ద సమస్య ఇదే. వారు ఆటగాడిని కేవలం ఓ ఆదాయ వనరుగా చూస్తారు తప్ప, అతని కెరీర్‌ను ఎలా తీర్చిదిద్దాలి? అనే దానిపై శ్రద్ధ పెట్టరు" అని సైమన్ డల్ ఘాటుగా విమర్శించాడు. వైభవ్ సూర్యవంశీ తన కెరీర్ సుదీర్ఘంగా సాగేలా చూసుకోవాలని.. కేవలం ప్రకటనల వెంట పడకూడదని సైమన్ డల్ సూచించాడు. "ఒకవేళ మీరు రేపు ప్రదర్శన చేయడం ఆపేస్తే.. ఈ మేనేజర్లు వెంటనే మరో ఆటగాడి వెనక్కి వెళ్తారు.

## పరాగ్ ఫోజులు ఆపు: కృష్ణమాచారి శ్రీకాంత్

రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్‌పై టీమిండియా మాజీ కెప్టెన్ కృష్ణమాచారి శ్రీకాంత్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. రియాన్ పరాగ్ ఫోజు కొట్టడం తప్ప రాణించింది ఏం లేదని మండిపడ్డాడు. కెప్టెన్‌గా.. బ్యాటర్‌గా అతను దారుణంగా విఫలమయ్యాడని అభిప్రాయపడ్డాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో సోమవారం జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ 57 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. వరుసగా నాలుగు విజయాల తర్వాత తొలి ఓటమిని చవిచూసింది. ఈ మ్యాచ్‌పై తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన క్రిష్ శ్రీకాంత్.. రియాన్ పరాగ్ చెత్త కెప్టెన్సీతోనే రాజస్థాన్ రాయల్స్ ఓటమిపాలైందని అభిప్రాయపడ్డాడు. 'రియాన్ పరాగ్ జట్టులో ఫోజు కొట్టడానికే ఉన్నాడు. స్టైల్‌గా బ్యాటింగ్‌కు వచ్చి త్వరగా ఔటయ్యాడు.

ఈవార్తలు

# ప్రజావాణి

www.evarthalu.com

నేటి ఈవార్తలు

బుధవారం 15-4-2026, జగిత్యాల

నేటి ఈవార్తలు

సంపాదకీయం Editorial

# కళాత్మక జీవనం - నేటి అవసరం

నేటి ఆధునిక ప్రపంచం ఒక ఉరుకుల పరుగుల క్షేత్రం. ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు గడియారం ముల్లుతో పోటీ పడుతూ, డబ్బే పరమావధిగా సాగుతున్న జీవన ప్రయాణంలో మనిషి తనలోని 'సృజనాత్మకత'ను కోల్పోతున్నాడు. ఒత్తిడి, ఆందోళనల నడుమ నలిగిపోతున్న సగటు మనిషికి కళ ఒక చల్లని వెన్నెల వంటిది. కళ అంటే కేవలం స్టేజి మీద చేసే ప్రదర్శనో, కాన్వాస్‌పై వేసే రంగులో కాదు. అది మనసులోని భావాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించే ఒక మాధ్యమం. ఒక పాట విన్నా, ఒక కావ్యం చదివినా, ఒక పెయింటింగ్ వేసినా అది మెదడుకు విశ్రాంతినిచ్చి, మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తుంది. అందుకే నేటి విద్యా వ్యవస్థలోనూ, పని ప్రదేశాల్లోనూ 'ఆర్ట్ థెరపీ'కి ప్రాధాన్యం పెరుగుతోంది. భాషతో సంబంధం లేకుండా హృదయాలను కదిలించగల శక్తి కళకు మాత్రమే ఉంది. లియోనార్డో డావిన్సీ పుట్టినరోజు సందర్భంగా జరుపుకునే ఈ 'ప్రపంచ కళా దినోత్సవం' మనందరికీ ఒక విషయాన్ని గుర్తు చేస్తోంది. అదేమిటంటే.. మనం చేసే పని ఏదైనా, అందులో ఒక కళాత్మక దృష్టిని అలవర్చుకుంటే జీవితం మరింత అందంగా మారుతుంది. కళాకారులు పుట్టాలి, కళలు వర్ధిల్లాలి. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు కళలను ప్రోత్సహించడంతో పాటు, ప్రతి వ్యక్తి తన దైనందిన జీవితంలో ఏదో ఒక కళను భాగం చేసుకోవాలి. అప్పుడే ఈ ఉరుకుల పరుగుల జీవితానికి అర్థం, పరమార్థం లభిస్తాయి. కళలను ఆస్వాదిద్దాం.. మానసిక ప్రశాంతతను పొందుదాం.

## ప్రపంచానికి ఎవరు ముప్పు?

**ప్రస్తుత ప్రపంచ రాజకీయాల్లో అమెరికా, ఇరాన్ దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు కేవలం ఆ రెండు దేశాలకే పరిమితం కాకుండా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థను, శాంతిని అతలాకుతలం చేస్తున్నాయి. ముఖ్యంగా 'అగ్రరాజ్యం' అన్న గర్వంతో అమెరికా ప్రదర్శిస్తున్న ఒంటెద్దు పోకడలు ఇతర స్వతంత్ర దేశాల సార్వభౌమాధికారానికి గొడ్డలిపెట్టుగా మారుతున్నాయి.**

అమెరికా తనకు నచ్చని దేశాలపై ఆర్థిక ఆంక్షలు విధించడాన్ని ఒక ఆయుధంగా మార్చుకుంది. ఇరాన్‌తో కుదుర్చుకున్న అణు ఒప్పందం నుంచి ఏకపక్షంగా తప్పుకోవడం ద్వారా అమెరికా తన విశ్వసనీయతను కోల్పోవడమే కాకుండా, పశ్చిమాసియాలో అస్థిరతకు కారణమైంది. ఈ నిర్ణయం వల్ల చమురు ధరలు పెరగడం, సరఫరా గొలుసు దెబ్బతినడం వంటి సమస్యలతో అనేక దేశాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ సంస్థలను బేఖాతరు చేస్తూ, తన ప్రయోజనాలే పరమావధిగా అమెరికా వ్యవహరిస్తోంది. ఏ దేశమైనా తమ సొంత విధానాలను అనుసరించే హక్కును కలిగి ఉంటుంది. కానీ, అమెరికా తన విధానాలను ఇతరులపై రుద్దాలని చూడటం, ఇరాన్ వంటి దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం ప్రజాస్వామ్య విలువలకే విరుద్ధం. మరోవైపు ఇరాన్ కూడా ప్రతీకార చర్యలకు దిగుతుండటంతో పరిస్థితి మరింత జటిలమవుతోంది. అయితే, బాధ్యతాయుతమైన దేశంగా వ్యవహరించాల్సిన అమెరికా, కక్షసాధింపు చర్యలకు దిగడం వల్ల మూడవ ప్రపంచ యుద్ధం వైపు అడుగులు పడుతున్నాయా అన్న అనుమానం కలుగుతోంది. ప్రపంచం ఇప్పుడు ఒకే ధ్రువం వైపు లేదు. దేశాల మధ్య వివాదాలను చర్చల ద్వారా, దౌత్యపరంగా పరిష్కరించుకోవాలి తప్ప, బలప్రయోగంతో కాదు. అమెరికా తన ఆధిపత్య ధోరణిని వీడి, ఇతర దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవించినప్పుడే ప్రపంచానికి శాంతి లభిస్తుంది. అంతర్జాతీయ సమాజం కూడా అమెరికా ఏకపక్ష నిర్ణయాలను ప్రశ్నించాల్సిన సమయం ఆసన్నమైంది.



రామస్వామి చింత
అచ్చంపేట

# భారత్.. బయో కార్ఖానా!




**ప్రపంచ ఔషధ రంగం రాబడిలో 'బయోలాజిక్స్, బయోసిమిలర్స్, స్పెషాలిటీ డ్రగ్స్' వాటా నేడు 40 శాతానికి పైగా ఉంటోంది. ఈ నేపథ్యంలో జనరిక్ ఔషధాల రీత్యా 'ప్రపంచ ఔషధశాల'గా చాలా కాలం నుంచీ ప్రాబల్యం గల భారత ఔషధ పరిశ్రమ తన వ్యూహాన్ని ఇప్పుడు విస్తరణ నుంచి ఆవిష్కరణల వైపు మళ్లిస్తోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం కూడా జనరిక్ ఔషధాల తయారీలో దేశ సామర్థ్యాన్ని స్థిరంగా ఉంచుతోంది. అదే సమయంలో ఈ అత్యాధునిక ఔషధ విభాగాల్లోనూ అధిక వాటా దక్కించుకునేలా దూరదృష్టి విధానాన్ని ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా 2026-27 కేంద్ర బడ్జెట్‌లో రూ.10,000 కోట్లతో 'మిషన్ బయోఫార్మా మాన్యుఫ్యాక్చరింగ్ శక్తి' పేరిట ఒక పథకం ప్రకటన ద్వారా నిర్ణయాత్మక ముందడుగు వేసింది. తద్వారా బయోఫార్మా ఆవిష్కరణలకు, అధిక మూల్య ఉత్పత్తుల సహిత చికిత్సా విధానాలకు ప్రపంచ కూడలిగా ఎదగాలన్న సంకల్పాన్ని చాటింది. శాస్త్రవిజ్ఞాన సామర్థ్యాలను విస్తృతం చేయడం, ఆవిష్కరణాధారిత సంస్థలను ప్రోత్సహించడం సహా భావితరం ఔషధాల ఉత్పాదనలో భారత్‌ను అగ్రస్థానంలో నిలపడం ఈ దార్శనిక పథకం లక్ష్యం.**



**జగత్ ప్రకాశ్ నడ్డా**
కేంద్ర ఆరోగ్య-కుటుంబ సంక్షేమ, రసాయనాలు-ఎరువుల శాఖ మంత్రి

ఈ మేరకు బయోలాజిక్స్, బయోసిమిలార్స్, ఆధునిక చికిత్స విధానాల్లో దేశీయ సామర్థ్యాలను ఇనుమడింపజేయడం ఈ కార్యక్రమం ప్రధాన ధ్యేయం. బయోఫార్మాస్యూటికల్స్ సహా లైఫ్ సైన్సెస్ రంగంలో పరిశోధన-అభివృద్ధిని ప్రోత్సహిస్తుంది. అలాగే ఔషధ విభాగం, శాస్త్ర-సాంకేతికతలు, బయోటెక్నాలజీ విభాగం చేపట్టిన 'ఫార్మా మెడ్‌టెక్' రంగాల్లోనూ పరిశోధన-ఆవిష్కరణలకు ఊతమిస్తుంది. అలాగే ఇతరత్రా పరిశోధన-అభివృద్ధి-ఆవిష్కరణల పథకం, బయోనెస్ట్ తదితర ప్రస్తుత కార్యక్రమాలకూ ఇది తోడ్పాటునిస్తుంది. వీటన్నిటి ద్వారా భారత ఆవిష్కరణావరణ వ్యవస్థ బలోపేతంతోపాటు పరిశ్రమ-విద్యాసంస్థల సహకారాన్ని ప్రోత్సహిస్తుంది. ఈ మేరకు జనరిక్ ఔషధాల నుంచి ఆవిష్కరణాధారిత ఔషధాల ఆవిష్కరణ-తయారీ దిశగా విశిష్ట మార్పు పరమావధిగా ఈ ప్రణాళికలు రూపొందాయి. 'ఫెర్మెంటేషన్' ప్రక్రియ ఆధారిత ఉత్పాదక సామర్థ్యాలను విస్తృతం చేయడం ఈ వ్యూహంలో కీలకాంశం. యాంటీబయాటిక్స్, టీకాలు, ఎంజైమ్‌లు, బయోలాజిక్స్ తయారీకి ఇది ప్రాధాన్యమిస్తుంది. అయితే, ఈ వ్యూహాత్మక రంగం చిరకాలం నుంచీ దిగుమతులపై ఆధారపడి ఉంది కాబట్టి, మౌలిక సదుపాయాలలో పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానాభివృద్ధి-బదిలీ సౌలభ్యం, లక్షిత ప్రోత్సాహకాల ప్రదానం ద్వారా దేశీయ సామర్థ్యం పెంచి, ప్రపంచ పోటీతత్వం మెరుగుపరచాలని భారత్ కృషి చేస్తోంది.

అయితే, భారత క్లినికల్ పరిశోధనావరణ వ్యవస్థ విస్తరణకూ అంతే ప్రాధాన్యం ఉంది. దీనికింద 1,000 గుర్తింపు పొందిన క్లినికల్ ప్రయోగ కేంద్రాలు ఏర్పాటు కానుండగా, ప్రపంచ ఔషధ అభివృద్ధి గమ్యంగా భారత్ స్థాయిని ఇవి గణనీయంగా పెంచుతాయి. వ్యయ సానుకూలత, ఇనుమడిస్తున్న నైపుణ్య సహిత పరిశోధకుల బృందం ద్వారా సమర్థ, అధిక-నాణ్యత గల క్లినికల్ ప్రయోగాలకు భారత్ అపార అవకాశాలను కల్పిస్తుంది. అలాగే, నియంత్రణ చట్రాల బలోపేతం, సంస్థాగత సామర్థ్యాల పెంపు చర్యలు కూడా దేశాన్ని అంతర్జాతీయ ప్రమాణానుగుణం చేయగలవు. తద్వారా సత్వర ఆమోదాల సౌలభ్యంతో ప్రపంచ భాగస్వాములలో విశ్వాసాన్ని పెంచుతాయి. భారత్ కొన్నేళ్లుగా 'పీఎల్ఐ' బల్క్ డ్రగ్ పార్క్ పథకాల తోడ్పాటుతో 'యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రీడియంట్స్ (ఏపీఐ), కీ స్టార్టింగ్ మెటీరియల్స్ (కేఎస్ఎం) స్థానికీకరణలోనూ శరవేగంతో పురోగమిస్తోంది. అందువల్లనే అంతర్జాతీయ స్థాయిలో భారత్ తయారీ మందుల ధరలు అత్యంత తక్కువగా ఉన్నాయి. అలాగే, పౌరులకు ఆరోగ్య సంరక్షణ వ్యయం కూడా అందుబాటులో ఉండేందుకు ఇది దోహదపడింది. ఇక ప్రధానమంత్రి భారతీయ జనౌషధి పరియోజన కింద దేశవ్యాప్తంగా 19,000కు పైగా జనౌషధి కేంద్రాలు లక్షలాది ప్రజలకు నాణ్యమైన జనరిక్ ఔషధాలను అందిస్తున్నాయి. కేన్సర్ వంటి అరుదైన, ప్రాణాంతక వ్యాధులకు చౌకగా మందుల లభ్యత సహా కీలక చికిత్సలపై కస్టమ్స్ సుంకం హేతుబద్ధీకరణ వంటి అనుబంధ చర్యలు ప్రాణరక్షక చికిత్సల సౌలభ్యం కల్పిస్తున్నాయి. అత్యాధునిక చికిత్స విధానాలు మరింత విస్తృతంగా అందుబాటులోకి వస్తున్న కొద్దీ, వాటి వ్యయంలోనూ తగ్గుదల నమోదవుతూ, సమాన సౌలభ్యానికి భరోసా ఇవ్వడం విధానపరమైన ఓ కీలక ప్రాధాన్యంగా కొనసాగుతోంది.

ఔషధ పరిశ్రమల రంగం పురోగమిస్తున్న కొద్దీ స్థిర మార్కెట్లలోనే కాకుండా వర్ధమాన రంగాల్లో.. ముఖ్యంగా ఆవిష్కరణాధారిత విభాగాలలోనూ తన ఉనికిని మరింతగా విస్తరింపజేయాలని భారత్ లక్ష్యనిర్దేశం చేసుకుంది. ఈ పరిణామాత్మక మార్పులు రావాలంటే సంస్కరణలు కీలకం. తదనుగుణంగా నియంత్రణ విధానాల సమన్వయం, ఆమోద ప్రక్రియల డిజిటలీకరణ, వేగంగా అనుమతుల దిశగా ప్రభుత్వం చేపట్టిన చర్యలు వాణిజ్య సౌలభ్యాన్ని మెరుగుపరుస్తున్నాయి. నాణ్యత ప్రమాణాలతోపాటు నియంత్రణ ప్రక్రియల బలోపేతం కచ్చితంగా భారత ఔషధ ఉత్పత్తులపై ప్రపంచ విశ్వాసం కొనసాగేలా చేస్తుంది. అయితే, పరిశోధన-అభివృద్ధి రంగంలో పెట్టుబడుల పెంపు ఓ కీలక సమస్యగా మిగిలింది. దీన్ని పరిష్కరించడంతోపాటు దీర్ఘకాలిక ఆవిష్కరణల కొనసాగింపులో బలమైన ప్రభుత్వ-ప్రైవేట్ సహకారం అవసరం. భవిష్యత్తు పరంగా విధానపరమైన మద్దతు, సాంకేతికతల పురోగమనం, మార్కెట్ అవకాశాల సమ్మేళనంతో ఔషధ రంగానికి ఒక ప్రత్యేక వృద్ధి అవకాశం అందివస్తుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే రూ.4 లక్షల కోట్లకు పైగా విలువగల భారత సుస్థిర దేశీయ మార్కెట్ విస్తరణకు సిద్ధమైంది. రాబోయే దశాబ్దంలో కేవలం జనరిక్ ఔషధాల్లో అగ్రగామిగా నిలవడమే కాకుండా వినూత్న ఔషధాలు, ఫెర్మెంటేషన్ ప్రక్రియ ఆధారిత ఉత్పత్తులు, భవిష్యత్తరం చికిత్సలలో భారత్ అగ్రశక్తిగా ఆవిర్భవించగల స్థితికి చేరింది.

అంతిమంగా ఆవిష్కరణాత్మక, పునరుత్థాన శక్తియుత భారతీయ ఔషధ రంగం నేడు ప్రపంచ పోటీతత్వంతో ఓ కొత్త దశలోకి ప్రవేశిస్తోంది. బయోఫార్మా 'శక్తి' కార్యక్రమం, విస్తరిస్తున్న క్లినికల్ మౌలిక సదుపాయాలు, లక్షిత తయారీ ప్రోత్సాహకాల వంటివాటి మద్దతుతో అధిక పరిమాణంపై ఆధారపడిన జనరిక్స్ కూడలి స్థాయి నుంచి అధిక మూల్యంగల బయోఫార్మా ఆవిష్కరణల అగ్రగామిగా దేశం రూపాంతరం చెందుతోంది. తద్వారా ప్రపంచ ఆరోగ్య సంరక్షణలో భారత్ పాత్రను బలోపేతం చేయడంతోపాటు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షించిన వికసిత భారత్-2047 కింద విస్తృత లక్ష్యాల సాధనకు ఈ పరిణామశీల మార్పు దోహదం చేస్తుంది.

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!

పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.